ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 25 | సంచిక : 5 | జనవరి 2020

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ఈ సంచికలో....

21-12-2007, అత్తిలి
అరుణాచల మహత్యం
శ్రీమద్భగవద్గీత

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## భగవాన్ శ్రీ రమణమహర్షి

భగవాన్ శ్రీ రమణమహర్షి మధురైకి సమీపములోని తిరుచ్చుళి గ్రామములో అళగమ్మ, సుందరం అయ్యరు పుణ్యదంపతులకు, పునర్వసు నక్షత్ర పుణ్యదినాన, అనగా ది॥ 30-12-1879న జన్మించారు. తరువాత కాలంలో వేంకటరామన్‌కి తన 17వ ఏట, మధ్యాహ్నం మధురైలో మేడపై గదిలో అమృతానుభవం కలిగింది. ఆ స్వానుభవములో వేంకటరామన్ 'ఋషి' అయినారు. అటు పిమ్మట ఇల్లు విడిచి, ది॥ 01-09-1896న పవిత్ర అరుణాచల క్షేత్రం చేరారు. అరుణాచలేశ్వరుడిని ఓ తండ్రీ! అని సంబోధించి, నీ ఆజ్ఞమేరకు వచ్చాను, అని విన్నవించుకొని, ఆనంద భాష్పాలతో అభిషేకించారు. అరుణాచల క్షేత్రములో ఏబది నాలుగు సంవత్సరములు నివసించి, ప్రపంచ వ్యాప్తముగా ముముక్షువులను తనవైపు ఆకర్షించి, అద్వైత జ్ఞానబోధ చేసారు. తల్లి తిరిగి ఇంటికి రమ్మని వేడుకొనగా, ఆమె ద్వారా మనందరికి తొలి ఉపదేశముగా ఇట్లు వ్రాసారు "కర్త (ఈశ్వరుడు) జీవులను, వారి వారి ప్రారబ్ధానుసారము ఆడిస్తున్నాడు. జరగవలసింది ఎవరు, ఎంత అడ్డు పెట్టిననూ జరిగి తీరుతుంది. జరగనిది ఎవరు, ఎంత ప్రయత్నించినా జరుగనే జరగదు. ఇది సత్యము, కనుక మౌనముగా ఉండుటయే ఉత్తమము". తల్లి తన కుమారుని స్థాయిని గుర్తించి, ఆమె జీవితాంతం భగవాన్‌తో గడిపి ఆయన ఒడిలోనే చివరి శ్వాసను విడిచింది. భగవాన్ శ్రీరమణమహర్షి తల్లికి ముక్తిని ప్రసాదించారు. ఆయన ప్రేమను కేవలం మానవులకే కాక, సకల జీవరాశికి సమానముగా పంచారు. గోలక్ష్మి జింక, కాకి, కుక్క మొదలైన జంతుజాలానికి కూడా ముక్తిని ప్రసాదించారు. చివరకు తన 71వ ఏట అనగా ది॥ 14-04-1950న రాత్రి గం॥ 8-47 ని॥లకు మహానిర్వాణము పొందారు. ఒక జ్యోతి

రూపములో అరుణగిరిలో ఐక్యం అయ్యారు. నాటికీ, నేటికీ భగవాన్ శ్రీరమణుని సమాధి, సన్నిధిలో, పరమశాంతి అనుభవైకవేద్యమే! "నిన్ను నీవు తెలుసుకో" అన్నదే భగవాన్ ఉపదేశ సారము.

ఓం తత్ సత్

(ది॥ 11-01-2020 శ్రీరమణ జయంతి సందర్భముగా)

- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**మీ చందా గడువు ముగిసినది. కావున చందాను పునరుద్ధరించుకోగలరు.**

భక్తుల కోరికపై సద్గురువు శ్రీ నాన్నగారి భోదామృతం ఇంకా వివరంగా అందివ్వాలనే ఉద్దేశంతో **రమణభాస్కర** మాసపత్రిక సెప్టెంబరు సంచిక నుండి మార్పులు చేయబడినది. దీనికి భక్తుల నుండి సలహాలు, సూచనలు ఆహ్వానిస్తున్నాము. పత్రికకు సంవత్సర చందా కట్టడంలో భక్తులు ఇబ్బందులు చెపుతున్నందు వలన ఇప్పటినుండి **శాశ్వతచందా** (10 సం॥లకు) రు॥ **1200**/-లుగా నిర్ణయించడమైనది. భక్తులందరూ ఈ అవకాశమును ఉపయోగించుకొని రమణభాస్కర మాస పత్రికకు శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**శాశ్వత చందా** (10 సం॥లకు) రు॥ **1200**/-లు
**సంవత్సర చందా** రు॥ **150**/-లు

మీ చందాను స్వయముగా గానీ, లేదా శ్రీ రమణ క్షేత్రం, కార్పొరేషన్ బ్యాంక్ అకౌంట్ నెం. 520101264185724 (IFSC Code : CORP0001613) నందు గాని చెల్లించగలరు. చందాను బ్యాంక్ అకౌంట్‌లో జమ చేసినవారు జమ చేసిన తేదీ, వారి పూర్తి అడ్రసు 8883147999కు తెలియపరచగలరు.

## ముఖ్య గమనిక

రమణ భాస్కర పత్రిక ప్రతీ నెల 5వ తేదీన పోస్టు చేయటం జరుగుతోంది. పత్రిక 12వ తేదీలోపు మీకు అందని యెడల ఈ క్రింది సెల్ నెంబరుకు ఫోన్ చేసి మీ రశీదు నెంబరు తెలియబరచిన యెడల పత్రిక మరల పోస్టు చేయబడును. కావున భక్తులు గమనించగలరు.

సెల్ : **8883147999**



## భగవాన్ ఔన్నత్యం, అరుణాచలేశ్వరుడితో అనుబంధం - శ్రీ నాన్నగారి మాటలలో...

అరుణాచలా! శ్రీ రమణ రూపా! శ్రీ నాన్న గురుదేవా! అంటూ శ్రీ నాన్నగారి భక్తులు నిత్యం గురు స్తుతి చేస్తూ ఉంటారు. ఈ ముగ్గురిలో ఎవరు తలంపుకి వచ్చినా, మిగతా ఇద్దరూ కూడా సహజంగా స్ఫురణలోకి వచ్చేస్తారు. ఆ ముగ్గురూ ఒకటే, వేరు కాదు, ఆ బ్రహ్మమే ఆ రూపాలు ధరించింది, అంటూ చాలా సందర్భాలలో శ్రీ నాన్నగారు చెప్పకుండానే చెప్పేవారు.

భగవాన్ చిన్నతనంలో బడినుంచి వస్తూ ఉంటే ఎదురు వచ్చిన మేనమామని పలకరిస్తూ ఎక్కడినుంచి వస్తున్నావు మావయ్యా అని అడిగాడు. అరుణాచలం నుంచి వస్తున్నాను అన్నాడు. అరుణాచలా అరుణాచలా, అంటూ ఆశ్చర్యపోయాడు. అరుణాచలం నుంచి వస్తున్నాను అంటే ఆశ్చర్యం ఎందుకు? ఎవరైనా అరుణాచలం నుంచి వస్తున్నాము అంటే మనకి ఆశ్చర్యం కలగదు. ఆయనకి ఆశ్చర్యం కలిగింది. అరుణాచలం నుంచి రావటం ఏమిటి అని, అరుణాచలా అరుణాచలా అనుకొంటూ ఉండిపోయాడు. అప్పుడు ఆయన మావయ్య, అలా కళ్ళు అప్పగించి చూస్తున్నావు ఏమిటి, అరుణాచలం అంటే నీకు తెలియదా? అది ఒక ఊరు - ఆ ఊరి పేరు అరుణాచలం, అక్కడ కొండ పేరు అరుణాచలం, అక్కడ దేవుడి పేరు అరుణాచలం. భారతదేశంలో ఉన్న పుణ్యక్షేత్రాలలో అది ఒకటి. అరుణాచలం అనే పేరు కూడా నువ్వు వినలేదా, అరుణాచలం అంటే ఏమిటో నీకు తెలియదా అన్నాడు మేనమామ.

ఎందుచేత ఆయనకి అంత ఆశ్చర్యం కలిగిందంటే, అరుణాచలం అంటే ఆయనకి ఊరు అని అర్థం అవ్వలేదు, కొండ అని అర్థం అవ్వలేదు. అరుణాచలం అనగానే ఆయనకి దేవుడు స్ఫురించాడు. దేవుడు దగ్గరినుంచి మనిషి వస్తాడా! బాగా అర్థం చేసుకోండి. అరుణాచలం అనే మాట వినగానే, ఊరు అనుకోలేదు, దేవుడు అనుకున్నాడు. దేవుడి దగ్గర నుంచి మనిషి ఎలా వస్తాడు? అని ఆలోచిస్తున్నాడు కాని ఆయన చెప్పింది ఆ ఊరి నుంచి

వచ్చానని. అరుణాచలం అనగానే భగవాన్‌కి దేవుడు అని స్ఫురించింది. ఆ పూర్వజన్మ సుకృతం చూడండి, ఆ పూర్వజన్మ వైభవం చూడండి!

మీ ఇంట్లో వాళ్ళని, వారు దేవుని ప్రతినిధులు అనుకొని మీరు సేవ చెయ్యండి. ఎవరైనా ఒక మాట అన్నారు అనుకోండి, మీరు కంగారు పడకండి. దేవుడే ఆ మాట అనిపిస్తున్నాడేమో, మన హృదయంలో ఏదైనా చెడ్డ ఉంటే తీసేయటానికి దేవుడే అనిపిస్తున్నాడేమో అనుకోమన్నారు భగవాన్.

మనం ధ్యానం కష్టపడి చెయ్యాలి. భగవాన్ ఇంటి దగ్గర కూర్చుంటే ధ్యానం వరించి వరించి వచ్చి ఆయన మీదకి వస్తోంది. ధ్యానం కోసం ఆయన ప్రయత్నం చెయ్యటం లేదు, ఇంటిదగ్గర కూర్చుని ఉండగా, ధ్యానం వరించి వరించి వచ్చి ఆయన మీదకి వస్తోంది. ఇదంతా ఆయన అన్నగారు చూసాడు. వీడేమీ చదువుకోవటం లేదు అని, నీ బోటి వాడికి ఇంటికాడ పనేముంది, ఎక్కడికైనా పోరాదా అన్నాడు. అప్పుడు రమణమహర్షికి మా అన్నగారు ఇలా అంటున్నాడు ఏమిటి అని కోపం రాలేదు. అరుణాచలేశ్వరుడు అన్నగారితో అనిపిస్తున్నాడు అనుకున్నాడు. ఇది అరుణాచలేశ్వరుడి పిలుపు, ఇది అరుణాచలేశ్వరుడి కేక! ఇది అన్నగారు అనటం లేదు, అరుణాచలేశ్వరుడు అన్నగారి నోటిని ఉపయోగించుకొంటున్నాడు. అరుణాచలేశ్వరుడు నన్ను పిలుస్తున్నాడు అని నిలబడ్డాడు. అన్నగారి మీద కోపం రాలేదు. నిలబడ్డ వెంటనే అరుణాచలేశ్వరుడు డబ్బు ఏర్పాటు చేసాడు. ఎక్కడికి వెళ్తున్నావు అని అడిగాడు అన్నగారు. నేను బడికి వెళ్తున్నాను అన్నాడు. అయితే ఫలానా చోట ఐదు రూపాయలు ఉన్నాయి, నీ బడి పక్కన నా కాలేజి ఉంది, నా కాలేజి ఫీజు కట్టేయి అన్నాడు. మనం అరుణాచలం వెళ్ళటానికి అన్నగారు డబ్బు కూడా రెడీ పెట్టేసాడు అనుకున్నాడు. ఇదంతా చేసేది ఈశ్వరుడు, డబ్బు అడగకుండా డబ్బు వచ్చేసింది. ప్రయాణానికి డబ్బు కావాలి కదా, అందుచేత అడగకుండానే డబ్బు ఇప్పిస్తున్నాడు అన్నగారి ద్వారా! ఇదంతా ఈశ్వరుడి ప్రణాళిక!

1896వ సంవత్సరం సెప్టెంబర్ ఒకటవ తేదీన ఆయన అరుణాచలం చేరి, సరిగ్గా గర్భగుడిలోకి వెళ్ళేటప్పటికి అక్కడ ఎవ్వరూ లేరు. ఈయన ఒక్కడే వెళ్ళాడు, అరుణాచలేశ్వరుడిని ఏమీ అడగలేదు, నాకు అది చెయ్యి ఇది చెయ్యి అని ఏమీ అడగలేదు. ఎంత ఠీవి చూడండి, ఆ దర్జా చూడండి, జ్ఞానం యొక్క వైభవం చూడండి! అప్పా, నువ్వు రమ్మంటే నేను వచ్చాను, నా అంతట నేను రాలేదు అన్నాడు. అప్పా నాకు భక్తి ప్రసాదించు, జ్ఞానం ప్రసాదించు, వైరాగ్యం ప్రసాదించు, ఇటువంటివి ఏమీ అడగలేదు. అప్పా, నువ్వు రమ్మంటే నేను వచ్చాను. ఈ దేహాన్ని నీకు సమర్పిస్తున్నాను, నీ ఇష్టం నువ్వు ఎలా

వాడుకుంటావో వాడుకో. నువ్వు ఎలా నడిపిస్తే అలా నడుస్తాను, నడిపించేవాడివి నువ్వే. నడిచేది నా దేహం. నువ్వు ఎక్కడ కూర్చోమంటే అక్కడ కూర్చుంటాను, ఎక్కడ నిలబడమంటే అక్కడ నిలబడతాను అని తన దేహాన్ని అరుణాచలేశ్వరుడికి సమర్పించుకొని, ఆయన చేతిలో ఒక పనిముట్టు అయిపోయాడు.

కంచి ఆచార్యులు వారు అన్నారు - తపస్సు చెయ్యకుండా, జపము చెయ్యకుండా, ధ్యానము చెయ్యకుండా, పూజ లేకుండా, నదులలో మునగకుండా, అధ్యయనం చెయ్యకుండా, గురువు శుశ్రూష చెయ్యకుండా, గురుశిష్య సంబంధం లేకుండా, ఏ ప్రయత్నమూ చెయ్యకుండా ఈ సృష్టిలో ఇంతవరకూ బ్రహ్మానుభవం పొందినవాడు ఎవరైనా ఒకరు ఉన్నారు అంటే, అది అరుణాచలమహర్షి మాత్రమే! ఏ సాధనా లేకుండా భక్తి లేకుండా ఎవరైనా వస్తువుని పొందారు అంటే అది అరుణాచలమహర్షి, అని కంచిస్వామి చెప్పారు.

అయితే కంచిస్వామి అలా చెప్పారు కాని, భగవాన్ ఆ విషయంలో కొంచెం కూడా ఆడంబరం చూపించలేదు. భగవాన్‌ని ఒకరు అడిగారు, మేము చాలా కష్టపడిపోతున్నాము, మీరు ఏ కష్టం లేకుండా వస్తువుని పొందారు. మేము చాలా తిప్పలు పడుతున్నాము, పూజలు చేయించుకొంటున్నాము, గుంజీలు తీస్తున్నాము, గుడుల చుట్టూ తిరుగుతున్నాము, సత్సంగాలు చేసుకుంటున్నాము, ముక్కులో గాలి చూసుకొంటున్నాము, ఇలా చాలా తంటాలు పడుతున్నాము. కాని మాకు బ్రహ్మానుభవం కలగటం లేదు. ఈ గొడవలు ఏమీ లేకుండా మీరు సుఖంగా ఒడ్డుకి వెళ్ళిపోయారు. ఇదేమి పద్ధతి అన్నారు. భగవాన్ నేను చాలా గొప్ప వాడిని అందుచేత నాకు కష్టం లేకుండా జ్ఞానం వచ్చేసింది అని ఆయన ఏమీ చెప్పలేదు. ఒకవేళ మీరు పడే కష్టం అంతా, మీరు చేసే సాధన అంతా, నాకు పూర్వజన్మలలో అయిపోయిందేమో అన్నారు. వాడు రమణ మహర్షి! మీరు ఏ కష్టమైతే పడుతున్నారో, ఏ సాధనలు అయితే మీరు చేస్తున్నారో, అదంతా బహుశా నాకు పూర్వ జన్మలలో అయిపోయి ఉండవచ్చు. అంతే కాని నేను అవతారపురుషుడిని అందుచేత నేను జ్ఞాని అయిపోయాను అలాగ ఏమీ చెప్పలేదు. రవ్వంత కూడా, ముల్లంత కూడా, ఆయన తన మీద పెట్టుకోడు. అసలు వ్యక్తీ భావన లేదు. మీరు పెట్రోమాక్స్ లైట్ పెట్టి వెదికినప్పటికీ అక్కడ వ్యక్తీ భావన కనపడదు.

ఆయనలో ఉన్నటువంటి ఆ నిరహంకార స్థితి, నిరాడంబర స్థితి, ఆ ఆత్మవైభవం, ఆత్మగొప్పతనం, ఆ అంతస్తు, ఆ అమృతస్థితి - అది ఎక్కడ కనిపిస్తుందంటే మీకు - మీ గురించి మేము అరుణాచలం వచ్చాము, మీరు ఉన్నారు కాబట్టి మేము అరుణాచలం వచ్చాము కాని, లేకపోతే మాకు పనేముంది అరుణాచలం రావటానికి అంటే, అప్పుడు

భగవాన్ సమాధానం చూడండి, నాకోసం మీరందరూ వచ్చారు అంటున్నారు, మరి నేను ఎవరి కోసం వచ్చాను! అక్కడ కూడా అహంకారం లేదు! మీరందరూ నాకోసం అరుణాచలం వచ్చామని చెపుతున్నారు, మరి నేను ఎవరికోసం వచ్చాను! నన్ను ఎవడైతే ఇక్కడికి తీసుకొచ్చాడో, వాడే మిమ్మల్ని కూడా ఇక్కడికి తీసుకొచ్చాడు. ఇద్దరు లేరు, ఉన్నవాడు ఒక్కడే. ఆ అనుభవం చూడండి, ఆ ఏకత్వం చూడండి! ఎవడైతే నన్ను అరుణాచలం తీసుకొచ్చాడో, వాడే మిమ్మల్ని కూడా ఇక్కడికి తీసుకొచ్చాడు. ఎవరి అనుగ్రహం వల్ల నాకు జ్ఞానం కలిగిందో, వాడి అనుగ్రహం వల్లే మీకు కూడా జ్ఞానం కలుగుతుంది. ఆయనతో సమానంగానే మనల్ని చూసాడు కాని, మనల్ని అజ్ఞానులుగా ఆయన ఎప్పుడూ చూడలేదు. మనం తిన్నదే ఆయన తిన్నాడు, ప్రత్యేకంగా ఆయన ఎప్పుడూ భోజనం చెయ్యలేదు. సహపంక్తి లోనే భోజనం చేసాడు. 24 గంటలూ అందరికీ అందుబాటులో ఉండేవారు. ఎప్పుడూ అలా కూర్చుని ఉండేవాడు, అంతేకాని ప్రత్యేకంగా ఈ సమయం మాత్రమే  అని అలా ఉండేది కాదు.

భగవాన్ చివరి రోజులలో మీ దేహం బలహీనపడింది, మీ దేహం పడిపోయేలాగ ఉంది, అందుచేత దర్శనం ఆపుచేసేస్తాము అని ఒక భక్తుడు భగవాన్‌తో అన్నప్పుడు. ఈ దేహం ఏదో కొద్దిగా అన్నం తింటోంది, దర్శనం కూడా ఇవ్వటానికి పనికిరాని ఈ దేహానికి మజ్జిగ అన్నం మటుకు ఎందుకు. మీరు దర్శనం ఇవ్వద్దు అంటున్నారు, దర్శనం కూడా ఇవ్వటానికి పనికిరాని ఈ దేహానికి, ఈ శవానికి మజ్జిగ అన్నం ఎందుకు, ఈ అన్నం కూడా మానేయండి, దర్శనాలు కూడా తీసేయండి అన్నారు భగవాన్. ఈ దేహం ఎంతోకొంత అన్నం తింటోంది కదా, ఎంతోకొంత అన్నం తింటున్నపుడు దర్శనం ఇవ్వటానికి ఏంటి? దర్శనం కూడా ఇవ్వటానికి పనికిరాని ఈ దేహానికి అన్నం కూడా ఎందుకు? అన్నారు భగవాన్.

మనమందరం హైదరాబాదు నుంచి అరుణాచలం వెళ్ళాము అనుకుంటున్నాము. అది నిజం కాదు. అరుణాచలం వాళ్ళమే హైదరాబాదు వచ్చి మళ్ళీ అరుణాచలం వెళ్తున్నాము. అరుణాచలం వెళ్లి వచ్చేసాము అంటాము. అలా కాదు, అరుణాచలం వాళ్ళమే ఇక్కడికి వచ్చి మళ్ళీ అరుణాచలం తిరిగి వెళ్తున్నాము. అలా అర్థం చేసుకోవాలి.  మనకి అరుణాచలం తోటే అనుబంధం. ఒక్కో భక్తుడికి ఒక్కో క్షేత్రంతో అనుబంధం ఉంటుంది. ఆచార్యులు వారికి కాశితో ఎంతో అనుబంధం ఉండేది. భగవానుకి అరుణాచలంతో ఎంతో అనుబంధం ఉండేది. 54 సంవత్సరములు ఆ శరీరం అరుణాచలంలో ఉంది. మనకి పుట్టింటి దగ్గర పది రోజులు ఉంటే అత్తగారి ఇంటికి వెళ్లిపోవాలి అనిపిస్తుంది. అత్తగారి ఇంటిదగ్గర పది

రోజులు ఉంటే పుట్టింటికి వెళ్ళిపోవాలి అనిపిస్తుంది. ఏమైనా సమస్యలు ఉంటే ఎక్కడికైనా వెళ్లి వచ్చేద్దాము అనిపిస్తుంది. సైట్ సీయింగ్ - అహంకారాన్ని సంతృప్తి పరుచుకోవటం కోసం ఈ తిప్పలన్నీ! ఈ శవాన్ని ఎక్కడైనా తిప్పుతా ఉంటే కొంచెం సంతృప్తి అన్నమాట. 54 సంవత్సరములు ఈ శరీరం అరుణాచలంలో ఉంది. ఈ అరుణాచలం విడిచిపెట్టి వెళ్ళాలి అన్న తలంపు కూడా ఎప్పుడూ రాలేదు అన్నారు భగవాన్. ఆ ఎటాచ్మెంట్ చూడండి, అరుణాచలం పట్ల జన్మాంతరమైనటువంటి అనుబంధం!

రమణమహర్షిని స్మరించుకొంటే అరుణాచలేశ్వరుడిని స్మరించినట్టే. రమణుడిని స్మరించుకున్నా అరుణాచలేశ్వరుడిని స్మరించుకున్నా అందులో బేధం చూడకండి, బేధం చూస్తే మీ నోటిలో దుమ్ము పడుతుంది! బేధం చూడొద్దు, అరుణాచలేశ్వరుడు అన్నా రమణుడు అన్నా ఒకటే, ఏసు బైబిల్ లో చెప్పాడు, నేను నా తండ్రి ఒకటే! అంటే ఎవరిని స్మరించినా ఒకటే.

## భగవాన్‌తో శ్రీ నాన్నగారి దేహాతీతమైన అనుబంధం



**నేను దేహములో ఉండగా భగవాన్ని చూడలేదు. భౌతికంగా చూడలేదు. అయితే నేను ఆయనని దేహములో ఉండగా చూడలేదు అనేటువంటి బాధ నాకు ఏమీ లేదు. కారణం ఏమిటంటే, భగవాన్‌ను ఆయన దేహం పడిపోయేముందు, మీ దేహం పడిపోతోంది మరి ఎవరు మమ్మల్ని కరుణిస్తారు, ఎవరు దయ చూపిస్తారు, ఎవరు మా పట్ల కృప చూపిస్తారు అని భక్తులు అడిగారు. అప్పుడు భగవాన్ ఒక చక్కటి బ్యూటిఫుల్ సెంటెన్స్ చెప్పారు. ఇది చిరకాలం కలకాలం జ్ఞాపకం పెట్టుకోవాలి. ఈ దేహం ఉన్నప్పుడు కూడా, దేహం మిమ్మల్ని అనుగ్రహించటం లేదు. ఏదైతే మిమ్మల్ని అనుగ్రహిస్తుందో, ఈ దేహం మరణించాక కూడా అది ఉ ంటుంది. ఏదైతే మిమ్మల్ని అనుగ్రహిస్తోందో దానికి మరణం లేదు. అది మిమ్మల్ని అనుగ్రహిస్తూనే ఉ ంటుంది. అంటే గురువుతోటి అనుబంధం ఒక జన్మ తోటిది కాదు. రమణ మహర్షి గారు చెప్పారు : పూర్వ జన్మలలో ఏమీ సంబంధం లేకుండానే మనం ఇక్కడ కలుసుకున్నామా, ఈ సంబంధం మనల్ని మరొక చోట కలపదా. అంటే బేధబుద్ధి నశించే వరకూ, అజ్ఞానం నశించేవరకూ, అహంకార బుద్ధి నశించేవరకూ, గురువు యొక్క సహాయ సహకారాలు ఉంటూనే ఉంటాయి. అంటే దేహం మరణించినప్పటికీ, గురువుతోటి ఉన్న అనుబంధం మట్టుకు తెగదు. గురువు అంటే దేహమాత్రుడు కాదు. గురువుని దేహానికి పరిమితం చెయ్యటం, ఆయనని అగౌరవపరచటం. రమణమహర్షి ఇప్పుడు లేడు అనుకోవటం ఆయనని అగౌరవపరచటం. అందుచేత ఆయన ఉన్నాడు, సజీవంగా ఉన్నాడు. ఆయన దేహం ఉందా లేదా అన్నది ప్రధానం కాదు. - శ్రీ నాన్నగారు**



ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 21 డిసెంబరు 2007, అత్తిలి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

రమణమహర్షి గారు ఎవరు? శివ కుమారుడు. అందుచేత రమణమహర్షిగారు అరుణాచలం వచ్చిన మొదటి రోజున ఏమన్నారంటే తండ్రీ నీ ఆజ్ఞను అనుసరించి ఇక్కడికి వచ్చాను అని చెప్పారు. శివుడి పట్ల ఆయనకి జనకభావం ఉండేది. నా అంతట నేను రాలేదు, నువ్వు రమంటే వచ్చాను. అరుణాచలం వచ్చిన మొదటి రోజున అరుణాచలేశ్వరుడిని దర్శించి నా అంతట నేను రాలేదు, స్వచ్ఛందముగా రాలేదు. నువ్వు పిలిస్తే వచ్చాను. నువ్వు రమ్మంటే వచ్చాను. ఈ మనోదేహములను నీకు సమర్పిస్తున్నాను. దీనిని ఎలా ఉపయోగించు కోవాలంటే అలా ఉపయోగించుకో. ఇంక నాదంటూ ఏమీ లేదు. అంతా నువ్వే అన్నాడు. అది పూర్ణశరణాగతి. ఎవరైతే పూర్ణశరణాగతి పొందారో వారికి అహంభావన వేరుతో సహా నశిస్తుంది. సనత్కుమారుడు సుబ్రహ్మణ్యుడిగా వచ్చాడని, సుబ్రహ్మణ్యుడే రమణ స్వామిగా వచ్చాడని ఒక సాంప్రదాయం. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పళని వచ్చి బట్టలు తీసేసి గోచీ పెట్టుకున్నాడు. రమణమహర్షి గారు కూడా అరుణాచలం వచ్చినప్పుడు బట్టలు తీసేసి గోచీ పెట్టుకున్నాడు.

ఒకసారి భగవాన్ తోటి ఎవరో మాట్లాడుతూ, ఇక్కడినుంచి పళని వెళ్తున్నాము స్వామీ అంటే, భగవాన్ అన్నారు, అక్కడున్న స్వామే ఇక్కడకు వచ్చాడు! ఈ స్వామి ఎవరు? అక్కడివాడే! రమణమహర్షిని కొంతమంది జ్ఞాని అనుకుంటారు, కొంతమంది భక్తుడు అనుకుంటారు. రకరకాలుగా అనుకుంటారు. ఆయన సాక్షాత్తు సుబ్రహ్మణ్యుడి అవతారం

అన్న సంగతి ఈ సృష్టిలో ఇద్దరి ముగ్గురికి తప్పించి ఎక్కువ మందికి తెలియదని గణపతి శాస్త్రిగారు చెప్పారు. రమణమహర్షిగారు శరీరం విడిచిపెట్టినప్పుడు ఆకాశంలో పెద్ద కాంతి వచ్చింది. లక్షలాది మంది చూసారు. మీరు హిందూపేపర్ చదివితే, 1950వ సంవత్సరం ఏప్రిల్ 15వ తారీకున అన్ని ఇంగ్లీష్ పేపరులలోనూ వచ్చింది. హిందూపేపరులో ఎడిటోరియల్ కూడా రాసారు. కొన్ని లక్షల మంది జనం చూస్తోంటే రమణమహర్షిగారు ఎక్కడైతే నిర్యాణం అయ్యారో, ఆ గదిలోంచి పెద్ద జ్యోతి బయలుదేరి ఆకాశమంతా తిరిగి అరుణగిరిలో ఐక్యం అయిపోయింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి టెక్నిక్ ఎలా ఉంటుందో, రమణమహర్షి గారి టెక్నిక్ కూడా అలా ఉంటుంది. మీరు ఎక్కడ వేలు పెట్టండి, ఆత్మ దగ్గరికి, చైతన్యం దగ్గరికి తీసుకువచ్చేస్తారు. ఒక భక్తుడు రమణమహర్షి గారి మీద తమిళంలో పద్యము రాసుకొని వచ్చాడు. నువ్వు ఒక్కడివే భూమి మీదకి వచ్చేశావు. నీకూడా వేలాయుధం లేకుండా వచ్చేశావు. నెమలి లేకుండా వచ్చేశావు. వల్లీదేవి లేకుండా వచ్చేశావు. దేవసేన లేకుండా వచ్చేశావు. నువ్వు సుబ్రహ్మణ్యుడి అంశ అని మేము గుర్తు పడతాము ఏమో అని నువ్వు గుర్తులు లేకుండా ఒక్కడివే వచ్చేశావు. అయినా మేము గుర్తుపట్టేసాము. మాకు దొరికిపోయావు. నెమలి లేకుండా, వేల్ లేకుండా అయినా మాకు దొరికేసావు. నీవు ఎవరివో తెలుస్తోంది అన్నాడు ఒక భక్తుడు. చాంద్యోగోపనిషత్తులో సనత్కుమారుడు ఎలా టీచ్ చేసాడో, ఆ ఎత్తుగడ తోటే టీచ్ చేస్తాడు. టీచింగుని బట్టి దొరికేస్తావు. బయట గుర్తులు లేకుండా వచ్చావు. మాకు దొరకకూడదు అనుకుంటున్నావు. నీ టీచింగుని బట్టి నిన్ను పట్టేస్తున్నాము.

రమణమహర్షి గారికి అరుణాచలేశ్వరుడి పట్ల జనకభావన ఉండేది. "దైవమనుచు నిన్ను దరిచేరగా" - అందరూ నిన్ను దేవుడు దేవుడు అని చెప్పుకుంటుంటే నీ దగ్గరికి వచ్చాను. "దైవమనుచు నిన్ను దరిచేరగా నన్ను పూర్ణనాశ మొనర్చితివి అరుణాచలా!" ఏదైతే నేను నేను అంటున్నానో ఆ నేనుని నాకు కాకుండా చేసేసావు.

మనందరికీ నేను అంటే ఇష్టం. మీకందరికీ మీ భర్త అంటే ఇష్టం అని మీరు అనుకుంటారు. అది నిజం కాదు. మీలోని నేనే మీకు ఇష్టం. ఆ నేనుకి మీ భర్త అనుకూలంగా ఉంటే ఇష్టం, అనుకూలంగా లేకపోతే మీ భర్త కూడా మీకు శత్రువే. జ్ఞాపకం పెట్టుకోండి. మనిషికి అందరి కంటే ఏది ఇష్టం. నేనంటే ఇష్టం. కానీ మీరు ఏమనుకొంటున్నారు అంటే, మా భర్త అంటే ఇష్టం అని అనుకుంటారు. అది అబద్దం. ఊరికే అనుకుంటారు. అది నిజం

కాదు. ప్రతి మనిషికి నేను అంటే ఇష్టం. ఆ నేనుకి ఎవరైతే అనుకూలంగా ఉంటున్నారో, మీ భర్తే కాదు, ఎవరైతే అనుకూలంగా ఉంటున్నారో వాళ్ళందరూ ఇష్టమే. అంటే ఈ దొంగ నేనుని ఎవరైతే గ్లోరిఫై చేస్తున్నారో వాళ్ళంటే ఇష్ట పడుతున్నాము. మీ భర్త కంటే కూడా మీకు ఎవరంటే ఇష్టం? మనం నేను నేను అంటాము కదా. ఆ నేను అంటేనే మనకు ఇష్టం.

నేను అనేది ఒక తలంపు. నాది అనేది ఒక తలంపు. సంసారం అంటే ఇంట్లో మనుషులు కాదు. ఈ రెండు తలంపులే సంసారం. ఎందుకంటే ఈ రెండు తలంపులు ఉన్నంతకాలం శరీరాలు వస్తాయి. మనం చేసిన కర్మని బట్టి శరీరాలు వస్తాయి. కుటుంబ సభ్యులు మారుతూ ఉంటారు. మంచో చెడ్డో ఏదో ఒకటి వస్తూ ఉంటుంది. సంసారం అంటే ఇంట్లో మనుషులు కాదు, పంచభూతాలూ కాదు, నేను అనేది ఒక తలంపు, నాది అనేది ఒక తలంపు. ఈ రెండు తలంపులే సంసారం. ఇలా చెప్పగలిగిన వాడు రమణమహర్షి ఒక్కడు మాత్రమే. సోది మాటలు ఏమీ చెప్పడు. సరిగ్గా సబ్జెక్టు చెప్పి వదిలేస్తాడు. మనందరం కూడా ఈశ్వరానుగ్రహానికి ప్రయత్నం చెయ్యాలి.

కొంతమంది ఏ రోజుకారోజు అకౌంట్స్ రాసుకుంటారు. ఇంట్లో ఖర్చు. ఎక్కౌంటు రాసుకోకపోతే ఎంత ఖర్చు అవుతోందో తెలియదు. మనం కూడా ఎకౌంటు రాసుకుందాము. ఇది డబ్బుకు సంబంధించింది కాదు. మన ఎక్కౌంటు ఏంటంటే ఈ రోజున ఉదయం ఐదింటికి మంచం మీద నుంచి లేచాము, రాత్రి తొమ్మిది గంటలకి నిద్ర పోతున్నాము. ఈ రోజు మనం మన డ్యూటీ సరిగ్గా చేసామా లేదా. ఏమైనా బద్ధకించామా? టైముకి జపం చేసుకున్నామా లేదా? టైముకి అన్నం తిన్నామా లేదా? బయట ఆకర్షణలకి ఏమైనా గురి అయ్యామా? అనరాని మాటలు ఏమైనా అన్నామా? పనికొచ్చే మాటలు మాట్లాడామా, అక్కరలేని మాటలు మాట్లాడామా? అని ఈ రోజు సాయంత్రం పడుకునేముందు మన ఇంట్లో పని మనం సరిగ్గా చేసుకున్నామా లేదా? మనం డ్యూటీ చేసే టైముకి మనం బద్ధకిస్తున్నామా? బద్ధకిస్తే బద్ధకించాము ఈ రోజున బద్ధకించక పోతే, ఈ రోజున బద్ధకించలేదు బాగానే పని చేసాము. ఇంట్లో పనికే బద్ధకించేవాళ్ళు ఇంక సమాజానికి ఏంచేస్తారు. ఇంట్లో పని కూడా రాసుకోండి. అదే ఎక్కౌంటు! ఇంటిదగ్గర మన డ్యూటీ చేస్తాము కదా ఇష్టం ఉన్నా లేకపోయినా! మన ధర్మం మనం నిర్వర్తించాలి కదా! ఇవన్నీ మీరు సాయంత్రం రాసేసుకోండి.

తరువాత ఎక్కౌంటు ఏంటంటే సమాజానికి ఏమైనా ఉపయోగపడ్డామా లేదా? అంటే డబ్బు రూపంలోనే అక్కరలేదు, ఎవరికైనా మాట సహాయం చేసామా, ఎవరైనా కష్టంలో ఉంటే వాళ్ళని వెళ్లి పలకరించి వచ్చామా? అది రెండో ఎక్కౌంటు, సమాజానికి చేసింది. తరువాత మనం సాధన ఏం చేసాము ఈవేళ? మనం మంచి మార్గం ఏమైనా తప్పామా? మంచిమార్గం కనుక మనం తప్పితే తెలివి డబ్బూ కూడా వృధా అయిపోతాయి, గంగలో పోసినట్టే. తరువాత ఈరోజు మన బుద్ధి నిదానంగా ఉందా, ఎక్కడైనా ఏమైనా ఆకర్షణలకి గురి అయ్యిందా? సరే మన పొట్టకి ఏదో పని చేసుకున్నాము, ఎవరికో ఏదో సహాయం చేసి వచ్చాము. రోజూ చెయ్యక్కరలేదు, చేసిన రోజున రాసుకోండి. లేకపోతే ఈరోజు ఎవరికీ ఉపయోగ పడలేదు అని రాసుకోండి. అది ఎక్కౌంటు.

మన పొట్టప్రీతికోసం చేసుకొంటున్నాము కదా అలాగే ఈశ్వరుడి ప్రీత్యర్థం ఏమైనా చేసామా? అంటే ఈశ్వరుడు సంతోషించే పని ఏదైనా మనం చేసామా? మన అహంకారం సంతృప్తి పడటం కాదు, ఈశ్వరుడి దయ కలిగితే మన అజ్ఞానం పోతుంది. ఆయన దయ కలగాలి. భగవంతుడి దయకి అసాధ్యం అంటూ ఏమీ లేదు. ఈశ్వరుడి దయ సంపాదించటానికి, మనకున్న బుద్ధి కానీ మనకున్న మనస్సుని దేహాన్ని కానీ ఎక్కడైనా ఉపయోగించామా? ఈ ఎక్కౌంటులు అన్నీ సాయంత్రం పడుకునేటప్పుడు రాసేసుకోండి. ఇప్పుడు నేను చెప్పే ఎక్కౌంటు రాసుకోవటానికి డబ్బు ఉండక్కరలేదు.

ఒకోసారి మనకి ఎవరిమీదైనా కోపం వస్తే వాళ్లకి అపకారం చెయ్యాలనిపిస్తుంది. కోపం మీద కానీ, ద్వేషం వల్ల కానీ కక్ష వల్ల కానీ ఈవేళ ఎవరికైనా అపకారం చేసామా? అపకారం చేస్తే వాళ్లకి ఇలా అపకారం చేసాము అని రాసుకోండి. అలా రాసుకొంటే రెండో రోజున తొందరపడి మీరు ఎవరికీ అపకారం చెయ్యరు. సాయంత్రం ఇవన్నీ రాసేసుకొని నిద్రపోండి. ఈవేళ ఈశ్వరుడి దయ సంపాదించటానికి కనీసం ఒక మాట అయినా మాట్లాడామా, ఒక పని చేసామా. లేకపోతే ఒక మనిషి ఎటువంటి వాడైనా, వాడి హృదయంలో ఉన్న ఈశ్వరుడిని దర్శించామా. తరువాత మనకి శత్రుత్వాలు మిత్రుత్వాలు లేకుండా ఉండగలిగామా? ఇవి అన్నీ రాసుకోండి. మీరు ఎక్కౌంటులు రాయటం నేర్చుకోండి. ఇలా చేసుకుంటే, మనం ఎప్పుడైనా పొరపాటు చేసాము అనుకోండి, ఎవరినైనా ద్వేషించాము అనుకోండి, ఫలానా రోజున ద్వేషించాము అని తెలుస్తుంది.

కృష్ణుడు గీతలో అతిగా స్నేహాలు చెయ్యొద్దు అన్నాడు. అతి సర్వత్ర వర్జయేత్! స్నేహాలు

తగుమాత్రంగా, గోరువెచ్చని నీళ్ళులాగా ఉండాలి. చేతులు కాలిపోయేలాగ ఉండ కూడదు. అతిగా స్నేహం చేస్తే మన టైము వాళ్ళు పాడు చేసేస్తారు, వాళ్ళ టైము మనం పాడుచేస్తాము. మీరు నిజమైన స్నేహితులు అయితే, వాళ్ళలో ఏమైనా పొరపాట్లు ఉన్నా వాళ్ళని పదిమందిలో విమర్శించకూడదు. ఒంటరిగా ఉన్నప్పుడు వాళ్ళ ఇంటికి వెళ్లి వాళ్ళు విన్నా వినకపోయినా, చెప్పి రండి. వాళ్ళు వినవచ్చు వినకపోవచ్చు, మీరు విమర్శించకూడదు, సలహా రూపంలో చెప్పాలి.

కనిన జననికన్న ఘనదయా దాయకా, ఇదియా నీ అనుగ్రహ మరుణాచలా! భౌతిక ప్రేమలలో తల్లి ప్రేమ చాలా గొప్పది. ఓ అరుణాచలేశ్వరుడా, అట్టి తల్లి ప్రేమ కూడా నీ ప్రేమతో సమానం కాదు. సూర్యుడి ముందు నక్షత్రాలు ఎలా ఉంటాయో, నీ ప్రేమ ముందు తల్లి ప్రేమ కూడా అటువంటిదే. సూర్యుడిని చూసి నక్షత్రాలని చూస్తే ఎలా ఉంటాయి? అంటే, తల్లికి ప్రేమ ఉన్నా, నీ ప్రేమతోటి పోల్చుకున్నప్పుడు తల్లి ప్రేమ కూడా తక్కువే. భగవాన్ స్కందాశ్రమంలో ఉండగా కొంతమంది వచ్చి మా దగ్గర పైసాలు లేవు, పెద్దల దగ్గరికి వచ్చినప్పుడు వట్టి చేతులతో వెళ్ళకూడదు అంటారు, మీకేమీ తేలేదు అనేవారు. అప్పుడు భగవాన్ నాకు ఏది కావాలో అది మీరు తెచ్చారు అనేవారు. పండు తింటే పోతుంది. మీకందరికీ నేను అనే తలంపు ఉంది కదా. నేనది కూలగొట్టటానికే వచ్చాను. ఆ నేను అనే తలంపు మీకు లేకుండా వచ్చారా? ఉండే వచ్చారు, నాకదే కావాలి అనేవారు.

దైవమనుచు నిను దరిచేరగా నన్ను పూర్ణనాశమొనర్చితివి అరుణాచాలా! నువ్వు దేవుడు దేవుడు అని నేను వస్తే, నన్ను నాకు కాకుండా చేసేసావు. అంటే ఆ నేను నేను కాదని ఎరుకపరిచావు. అంటే నన్ను నాశనం చేసావు అంటే దేహగతమైన నేనుని, మనోగతమైన నేనుని, పరిమితమైన నేనుని, హద్దులకలిగి ఉన్న నేనుని, ఆ మాయ నేనుని, అవిద్య నేనుని కూలగొట్టావు. దేవుడవని నీ దగ్గరికి వస్తే ఇంత పని చేసావు. హద్దులు లేకుండా, లిమిటేషన్స్ లేకుండా చేసావు అరుణాచలా!

ఎక్కౌంటుల గొడవలో ఇంకోటి రాసుకోండి. మన ఇంద్రియాలు ఈవేళ ఎలా ఉన్నాయి. దొంగచూపులు ఏమైనా చూస్తున్నాయా? సినిమాకి వెళ్ళే అలవాటు ఉంటే, ఈరోజు సినిమాకి వెళ్ళే తలంపు వచ్చిందా. రాకపోతే తలంపు రాలేదు వచ్చింది అనుకోండి, తలంపు వచ్చింది నిగ్రహించుకొన్నాను ఒకవేళ తలంపు నిగ్రహించుకోలేకపోతే, నిగ్రహించుకోలేక పోయాను సినిమాకి వెళ్లిపోయాను, అని రాసుకోండి. మనస్సు ఎలా ఉంది, ఏమైనా చెడు

తలంపులు వచ్చాయా దీనికి? అంటే శారీరకంగా మనం ఏమీ చెడ్డ చెయ్యకపోవచ్చును, కానీ మనస్సులో కూడా చెడ్డ తలంపులు రాకూడదు.

భగవంతుడు చూసేది నీ దేహం ఎక్కడ ఉంది అని కాదు, నీ మనస్సు ఎక్కడ ఉంది. నీ దేహం అత్తిలిలో ఉందా అరుణాచలంలో ఉందా భీమవరంలో ఉందా కాశీలో ఉ ందా అది ముఖ్యం కాదు. శవం ఎక్కడ ఉందో దేవుడికి అక్కరలేదు. నీ మనస్సు ఏమైనా ముగ్గుతోందా లేదా, మెచ్యూరిటీ వచ్చిందా లేదా అని చూస్తూ ఉంటాడు. కొంతమందికి వయస్సు వంద ఏళ్ళు వచ్చినా మెచ్యూరిటీ రాదు. వాళ్ళు అసలు ముగ్గరు. వంద సంవత్సరాలు వయస్సు వచ్చినా వాళ్లకి ఏమీ తెలియదు, వాళ్ళకున్న అలవాట్ల లోంచి బయటికి రారు, వాళ్ళు మాట్లాడే మాటలలోంచి బయటికి రారు. వాళ్ళ బుద్ధిలో ఏమైనా వంకరలు ఉంటే కనీసం తీసుకోవటానికి ప్రయత్నం చెయ్యరు. వంద ఏళ్ళు వచ్చినా సరే అలాగే ఉంటారు వాళ్ళు. కొంతమంది పుట్టినప్పుడు ఎలా ఉంటారో, సాధన ఏమీ ఉండదు, చచ్చిపోయినప్పుడు కూడా అలాగే ఉంటారు. వాళ్లని కనుబొమ్మ మీద వెంట్రుకలు అంటారు. మనం పుట్టినప్పుడు కనుబొమ్మ మీద వెంట్రుకలు ఎలా ఉంటాయో చచ్చిపోయినప్పుడు కూడా అలాగే ఉంటాయి. మానసికంగా ఎదుగుదల లేని వాళ్లని, హృదయంలో వికాసం లేని వాళ్లని కనుబొమ్మ మీద వెంట్రుకలు లాంటి వాళ్ళు అంటారు.

మనస్సు ఎలా ఉందో ఎకౌంటు రాసేసుకోండి. ఈరోజున మనస్సు శాంతిగా ఉందా అశాంతిగా ఉందా, వాసనలు అన్నీ అణిగి ఉన్నాయా, ఏ వాసన అయినా వచ్చి మనని బాధ పెట్టిందా. బాధ పెడితే బాధ పెట్టిందని, వస్తే కంట్రోల్ చేసుకొన్నాము అని, లేకపోతే కంట్రోల్ చేసుకోలేదు బరస్ట్ అయ్యాము అని రాసేసుకోండి. కోపం వచ్చినా, నిగ్రహించుకొన్నామా, నిగ్రహించుకోలేక బరస్ట్ అయ్యామా? నిగ్రహించుకొందామన్నా ఒక్కోసారి బరస్ట్ అయిపోతాము, నోటికి ఎలా వస్తే అలా తిట్టేస్తాము. ఇవన్నీ ఎకౌంటులో రాసుకోండి.

వశిష్టుడు రాముడికి బోధిస్తూ అంటాడు, పురుషప్రయత్నం అవసరమే, నువ్వు చేసే ప్రయత్నం హృదయపూర్వకంగా నిండుమనస్సుతో చెయ్యి. ఆత్మజ్ఞాన సముపార్జనకి, సత్యజ్ఞాన సముపార్జనకి నువ్వు చేసే ప్రయత్నం చెయ్యి. ప్రయత్నాన్ని పురుషకారం అంటారు వేదాంతభాషలో. ప్రయత్నంలో అశ్రద్ధ అక్కరలేదు, కానీ ఈశ్వరానుగ్రహంతో పోల్చుకున్నప్పుడు, నీ ప్రయత్నం ఏపాటిది! దాని అర్థం ఏమిటంటే, ఈశ్వరునికి మనకి పది అడుగుల దూరం ఉన్నప్పుడు, మనం కష్టపడి ప్రయత్నం చేసి ఒక అడుగు వేస్తే, తొమ్మిది అడుగులు వేసి

ఎదురు వచ్చి మనని ఆయన ఒడిలోకి తీసుకుంటాడు. వాడు ఈశ్వరుడు. పురుషకారం మంచిదే, కానీ ఈశ్వరానుగ్రహంతో పోల్చినప్పుడు ఏపాటిది నీ పురుషప్రయత్నం! అసలు చెయ్యకుండా ఊరుకోకు, కానీ ఆ వచ్చేది వరద, ఆ జ్ఞానగంగ ప్రవాహం ఉరికి అటువైపునుంచి రావాలి. నువ్వు చెయ్యగలిగింది ఏమీ నువ్వు మానవద్దు, అలాగని నీ ప్రయత్నం వల్లే దైవసాక్షాత్కారం కలుగుతుంది అనుకోకు. ఆయన దయ రావాలి, మహా ప్రవాహం అది. గోదావరికి వరద వచ్చినప్పుడు ఆ మహా ప్రవాహంలో పెద్ద పెద్ద దున్నపోతులు, ఆంబోతులు, టేకుదుంగలు ఎలా కొట్టుకొనిపోతాయో, దేవుని అనుగ్రహం అనే వరద వచ్చినప్పుడు నీ బలహీనతలు, నువ్వు కాని గొడవలు అన్నీ కూడా నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా కొట్టుకుపోతాయి. అట్టిది ఆ వరద. వందమంది కలిసి కదపలేని దుంగలు ఆ ప్రవాహంలో తాటాకులలాగ కొట్టుకుపోతాయి. దేవుని యొక్క కృప వస్తే, మీరు కష్టపడి సాధన చేసి ఏ బలహీనతలలోంచి అయితే బయటికి రాలేరో, ఆ బలహీనతలన్నీ ఆయన అనుగ్రహంలో కొట్టుకుపోతాయి. జ్ఞాన సముపార్జనకి పైసాలు అక్కరలేదు. తెలుసుకోవాలనే కాంక్ష చాలు. ఆ జిజ్ఞాస లోపలినుంచి రావాలి, పైనుంచి పోసేది కాదు. ఏది వచ్చినా లోపలినుంచే రావాలి. మనం బాగుపడాలి అనే బుద్ధి వచ్చినా అది లోపలినుంచే రావాలి. ఏదివచ్చినా అది లోపలినుంచే రావాలి. జ్ఞానసముద్రం మీ లోపలే ఉంది. అది పొంగినప్పుడు మీ సహస్రారాన్ని ముంచేస్తుంది. అసలు మీకు ఈశ్వరుడిని దర్శించాలి అనే తలంపు కూడా ఈశ్వరుని దయ లేకుండా రాదు. ఇది బాగా నేర్చుకోండి. ఈశ్వర సాక్షాత్కారం పొందాలనే తలంపు మీకు వస్తే అది కూడా ఈశ్వరానుగ్రహం లేకుండా రాదు. దీనిని బట్టి ఏంటి, అంతా ఈశ్వరానుగ్రహమే మనం సున్నలు అయిపోవాలి.

మీకు ఎవరికైనా పది రూపాయలు ఉంటే నాకు పదిరూపాయలు ఉన్నాయి అంటారు, ఇంకొకడు నాకు వంద ఎకరాలు ఉన్నాయి అంటాడు. ఇదంతా మీది కాదు ఈశ్వరుని సొత్తు. మీ ప్రారబ్ధాన్ని బట్టి మీకు ఒక ఎకరం కేటాయించాడు, ఇంకొకరికి వంద ఎకరాలు కేటాయించాడు. ఆ సొత్తు మీది కాదు నాది కాదు, ఆ సొత్తు ఈశ్వరుడిదే. మీ దేహప్రారబ్ధాన్ని బట్టి ఆయన సొమ్ము మీకు కేటాయించాడు. అది తెలియక నాది నాది అనుకొంటున్నారు. అది తెలిస్తే అనుకోరు. సొమ్ములు మనవికాదు ఈశ్వరుడువి. అది మన తెలివితేటల వల్లే సంపాదించాము అని మీరు అనుకొంటారు. మరి మీకంటే తెలివైన వాడు ఎందుకు సంపాదించలేదు? ఆ బుద్ధి మీకు రాదు. డాక్టరు కోర్సు చదివి నెలకి ఐదువేల ఆదాయం లేని వాళ్ళు ఉన్నారు, నెలకి రెండులక్షలు తెచ్చుకునేవాళ్ళు ఉన్నారు. క్వాలిఫికేషన్

సమానమే. మరి ఈ తేడాలు ఏమిటి? అది దేహప్రారబ్దం. ఈ సొత్తు మనది కాదు ఈశ్వరుడిది. మీకు ఏదో డబ్బు ఉంది అనుకోండి అది భగవంతుడు కేటాయించాడు. మీకు ఉన్నది నూటికి నూరు పాళ్ళు మీరే తినేస్తున్నారు అనుకోండి, మీరు దొంగలు అన్నాడు. కొంతమందిని కూలివాళ్ళు అన్నాడు. కొంతమందిని మా వంక చూడండి అంటే, వీళ్ల వంక చూస్తే మనకేమి కలిసివస్తుంది అనుకుంటారు. మీరు మావంక చూసి కొంచెం నవ్వండి అంటే, వీళ్ల వంక స్మైలింగ్ ఫేస్ పెట్టి చూస్తే మనకి ఏమి కలిసివస్తుంది అనుకొంటారు. కొంతమంది వాళ్లకి కలిసిరాకపోతే వాళ్ళు ఏ పనీ చెయ్యరు, కనీసం నవ్వరు, మాట్లాడరు. వాళ్ళని కూలివాళ్ళు అన్నాడు. రూపాయిలో ఒక్క పైసా కూడా సమాజానికి ఉపయోగించకుండా, రూపాయికి రూపాయి ఉన్నదంతా మీరు తినేస్తుంటే వాళ్ళు దొంగలు' అన్నాడు భగవంతుడు. సొత్తు నాది దొంగలు మీరు.

ఏసుక్రీస్తు బైబిల్లో ఏమన్నాడంటే, మీకు పది రూపాయలు ఉంటే తొమ్మిది రూపాయలు మీకోసం ఖర్చుపెట్టుకోండి. మీరు బ్యాంకులో వేసుకుంటారో, బట్టలు కొనుక్కుంటారో, అన్నం తింటారో మీ ఇష్టం. ఒక రూపాయి అయినా సమాజానికి ఉపయోగించండి. దానిని దశమభాగం అంటారు. నీకు సంవత్సరానికి పదిలక్షల ఆదాయం ఉంటే, తొమ్మిది లక్షలే నువ్వు ముట్టుకో, ఒక లక్ష నువ్వు ముట్టుకోకు, ఒక పక్కన పెట్టు. ఆ లక్ష నీది కాదు, అది ఈశ్వరుని ప్రీత్యర్థం ఈశ్వరుని కృప సంపాదించటానికి ఉపయోగించుకో. అంటే ఈశ్వరునికి ఒక వంతు అయినా ఇవ్వు, మిగతా తొమ్మిది వంతులు నువ్వు అనుభవించు. అది మొత్తం ఈశ్వరుడి సొత్తే అయినా, దశమభాగం కేటాయించాక అది కూడా నువ్వు తినేస్తే నువ్వు దొంగవి అన్నాడు.

అమెరికాలో చర్చి పేరుమీద కేవలం భక్తే కాకుండా కొంత నిష్కామ కర్మ చేస్తారు, కొన్ని మంచి పనులు కూడా చేస్తారు. కొన్ని చర్చిలు ఓల్డ్ ఏజ్ హోములు కూడా నడుపుతాయి. పూజకే పరిమితం కాకుండా, వచ్చే ఆదాయాన్ని చూసుకొని కొంత నిస్వార్థ సేవ చేస్తారు. సారా తాగి, లోకం యొక్క ఆకర్షణలో పడి పాడైపోయిన వాళ్లని కూడా ఈ చర్చిలు చేరదీసి పోషిస్తూ ఉంటాయి. అమెరికాలో కూడా బ్యాడ్ హేబిట్స్ వలన పాడైపోయిన వాళ్ళు ఉన్నారు. మనం అమెరికా వెళ్లినా ఇంగ్లాండ్ వెళ్లినా, మన నిదానంలో మనం ఉండాలి. మన సబ్జెక్టు మనం విడిచిపెట్టకూడదు. మన సంస్కృతి విడిచిపెట్టకూడదు. మనం నాలుగు రూపాయలు సంపాదించటానికి అమెరికా వెళ్లినా మన మనస్సు పాడవకూడదు. అది గుర్తుపెట్టుకోవాలి. కేవలం డబ్బు వలనే మనిషి సుఖపడడు. అసలు సుఖం అనేది ప్రపంచంలో డబ్బులో కాని,

గౌరవంలో కాని, కీర్తిలో కాని, అధికారంలో కాని, ఎక్కడా సుఖం అనేది లేదు. లోకంలో ఎక్కడా శాంతి లేదు, సుఖం లేదు. అంతా మన హృదయంలోనే ఉంది. మోక్షం మన హృదయంలో ఉంది. శాంతి మన హృదయంలో ఉంది. సుఖము మన హృదయంలో ఉంది. అయితే ఈ హృదయములో ఉన్న శాంతి మన మెదడుకి మన ఇంద్రియాలకి అందదు. మన అవగాహనకి అందదు. హృదయములో ఉన్న శాంతి నీ శిరస్సుకి అందుతా ఉంటే నీకు ఊపిరి సలపదు. దేహం ఉందో లేదో, లోకం ఉందో లేదో కూడా నీకు గుర్తు ఉండదు. ఆ స్థాయిలో మీరు ఏ పని చేసినా ముక్కుతోటి గాలి ఎంత సహజంగా పీల్చుకొంటున్నారో, సత్కర్మ కూడా అంత సహజంగా చేస్తారు. ఆత్మజ్ఞానం కలిగితే అప్పుడు కర్త ృత్వ భావన ఉండదు. నేను చేస్తున్నాను అనే తలంపు లేకుండా ఎప్పుడైతే చేస్తారో, అప్పుడు కర్మ సహజంగా చేస్తారు. దాని ఫలితం మనల్ని చుట్టుకోదు.

భగవంతుడి స్వరూపమే అనుగ్రహం, భగవంతుడి స్వరూపమే దయ. మీ ఇంటిలో ఎవరికైనా పిచ్చి ఎక్కి రోడ్డుమీదకి వెళ్ళిపోతే, మీరే తాళ్ళు పెట్టి కట్టేస్తారు. ఇష్టం లేక కాదు, వాడు రోడ్డు మీద తిరగకుండా ఉండటం కోసం, వాడికి మందులు ఇవ్వటం కోసం. అలాగే ఈశ్వరుడు కూడా కష్టాలు కల్పిస్తూ ఉంటాడు. ఇష్టం లేక కాదు, వాడికి బుద్ధి రావటానికి. ఈశ్వరుడు కూడా ఒక్కోసారి మిమ్మల్ని తలుపుసందున పెట్టి నొక్కేస్తాడు. అప్పుడు మనకి అనిపిస్తుంది ఎటు చూసినా ముళ్ళకంప ఏంటని. అత్తారింటికాడ ముళ్ళకంప, పుట్టింటికాడ ముళ్ళకంప, ఎవరైనా స్నేహితుల ఇంటికి వెళ్దాము అంటే వాళ్ళ ఇంటికాడ ముళ్ళకంపలు. ఎటుచూసినా దారి కనబడటం లేదు, ఎటు చూసినా ముళ్ళకంపలే అనిపిస్తుంది. ఒకోసారి కావాలని అటువంటి పరిస్థితులలో మిమ్మల్ని పెట్టేసి మీ బుర్రలో ఉన్న విషం కక్కిస్తాడు, వాడు దేవుడు. మనం దేవుడిని తిట్టి పోసేస్తాము, మన మీద ఇష్టం లేదు, దేవుడి దయ మనమీద లేదు అనుకొంటాము. దేవుడి దయ అనేది ఉందని కూడా మీకు తెలియటం లేదు, ఉందని గుర్తింపు కోసం మీ చేత విషం కక్కిస్తాడు. వాడు ఈశ్వరుడు.

రుచి తెలియాలంటే కొంచెమైనా ఆకలి ఉండాలి. అసలు ఆకలి లేకపోతే కూర ఎంతబాగున్నా రుచి తెలియదు. దేవుడు సర్వజ్ఞుడు, దేవుడు దయాస్వరూపుడు, కరుణా స్వరూపుడు. దేవుడిని తెలుసుకోవాలి, దైవానుగ్రహం పొందాలి ఆత్మానుభవం పొందాలి అనేటటువంటి ఆకలి ఆ జిజ్ఞాస కొంచెమైనా మీకు ఉండాలి. ఆకలి లేదనుకోండి, కూర అమృతంలా ఉన్నా నోటికి చేదుగా ఉంటుంది. ఆ కొంచెం జిజ్ఞాసే పెట్టుబడి. దీనికి రూపాయలు

అక్కరలేదు. డబ్బుకి జ్ఞానానికి ఏమీ సంబంధం లేదు. మీకున్న జిజ్ఞాస, ముముక్షత్వమే పెట్టుబడి.

వైష్ణవులు కొంతమంది, మాకు ముక్తి అక్కరలేదు భక్తి చాలు అంటారు. వాళ్లకి ఎక్స్‌పెక్టేషన్ ఉండదు. పైగా వాళ్ళు, స్వామి నిన్ను ఇబ్బంది పెట్టటం ఎందుకు, నీకు ఎప్పుడు ఇవ్వాలంటే అప్పుడే ఇవ్వు అంటారు. మాకు మోక్షం అక్కరలేదు, ఇమ్మని అడగము, బలవంతం చెయ్యము, నో కంపల్షన్ ఎటాల్. నువ్వు ఇవ్వాలనుకొన్నప్పుడు ఇయ్యి, ఇవ్వటం ఇష్టం లేదనుకో మానేయి. అలాగని నీ పాదాలు విడిచిపెట్టము. నువ్వు పొమ్మన్నా నీ పాదాలు పట్టుకొని వేలాడుతూ ఉంటాము అంటారు. వారు భక్తులు.

గాంధీ గారు, ఆయన భార్య దక్షిణాఫ్రికాలో ఉండగా ఏవో పేచీలు పెట్టుకొన్నారు. గాంధీగారికి భార్యమీద కోపం వచ్చేసింది. మీ పుట్టింటికి వెళ్లిపో అని తలుపు తీసి ఆవిడని బయటకు పంపి ఈయన గదిలోకి వచ్చి తలుపు వేసేసుకొన్నాడు. ఆవిడ అంది, పుట్టింటికి వెళ్లటానికి ఇది దక్షిణాఫ్రికా, పుట్టిల్లు ఇండియాలో ఉంది, నేను ఎక్కడికి వెళ్తాను ఇక్కడే ఉంటాను. తలుపు తీస్తే తియ్యి లేకపోతే బయటే పడుకుంటాను అంది. ఏంచేస్తాడు, మళ్లీ పది నిమిషాల తరువాత తలుపు తీసి లోపలికి రమ్మన్నాడు. మనం కూడా ఒకవేళ భగవంతుడు మనల్ని తిరస్కరించినా ఆయన పాదాలు విడిచి పెట్టకూడదు. అందుకు చెపుతున్నాను. నేను జీవితంలో నా భార్యపట్ల హిమాలయ పర్వతమంత తప్పు చేసాను అని తరువాత గాంధీగారు అన్నారు. గాంధీ గారి భార్య జైలులో చనిపోయారు. గాంధీగారి కొడుకులు జైలు లోపలికి వెళ్లి నిప్పు పెట్టారు. శవం పూర్తిగా ఎముకలతో సహా కాలేవరకూ గాంధీగారు అక్కడనుంచి కదలలేదు. నేను పెట్టిన బాధలు అన్నీ పడింది ఇప్పుడు కనిపించకుండా వెళ్లిపోతోంది అన్నారు.

ఇప్పుడు ఇంతకీ ఈ గొడవలు గాంధీ గారి కోసం చెప్పటం లేదు. గాంధీగారు పొమ్మన్నా భార్య ఎలా అంటిపెట్టుకుందో, ఒకవేళ భగవంతుడు మనల్ని పట్టించుకోక పోయినా మనం భగవంతుడి పాదాలు మాత్రం విడిచిపెట్టొద్దు. ఒకవేళ మన కోరికలు నెరవేర్చడు అనుకోండి దేవుడు, ఆ కోరికలు నెరవేర్చకపోవటానికి కారణం ఉంటుంది. ఆ కారణం ఆయనకి తెలుసు కానీ మనకి తెలియదు. కోరికలు నెరవేర్చిన వాళ్లకి ఎందుకు నెరవేర్చాడో తెలియదు. కొంతమందికి ఆపుచేస్తాడు కోరికలు నెరవేర్చకుండా, వాళ్లకి ఎందుకు ఆపుచేస్తున్నాడో మనకు తెలియదు. మనకేది మంచిదో మనకంటే దేవుడికి బాగా తెలుసు. అందుచేత మనం శరణాగతి చెయ్యటం మంచిది. శరణాగతి చెయ్యటం వల్ల లాభం ఏమిటంటే, శాంతి

కలుగుతుంది, దొంగనేను బయటికి పోతుంది. మనకి తెలియకుండా దొంగనేను రాలిపోతుంది.

భగవాన్ స్కందాశ్రమంలో ఉండగా ఒక భక్తుడు ఆయన దగ్గరికి వచ్చాడు. భగవాన్ ఆయనతో మాట్లాడటం లేదు. ఆయన చాలా ప్రేమగా ఇష్టంగా వచ్చాడు. ఆ భక్తుడు అన్నాడు, ఒకవేళ నువ్వు నాతో మాట్లాడినా మాట్లాడక పోయినా, నా మీద నీకు ఇష్టం ఉన్నా ఇష్టం లేకపోయినా, ప్రేమ ఉన్నా లేకపోయినా, వంద జన్మల తరువాత అయినా సరే నేను నీ చేతులలోనే తరించాలి, నీ చేతులలోనే మోక్షం పొందాలి అన్నాడు. వాడు భక్తుడు. నాతో మాట్లాడటం ఇష్టం లేకపోతే మానేయి. నా వంక చూడటం లేదు నువ్వు. పోనీ ఇప్పుడు చూడకపోయినా వంద జన్మల తరువాత అయినా నీ చేతితోనే నాకు శాంతిని ప్రసాదించు. అందుచేత నామీద నీకు ప్రేమ ఉందని ఇంత దూరం వచ్చాను. వెయ్యి సంవత్సరాల తరువాత అయినా కూడా నువ్వే నన్ను ఉద్ధరించు. నేను తొందర పడటం లేదు. నువ్వు లవరువే, కానీ క్రుయల్ లవర్ అన్నాడు. నువ్వు నన్ను ప్రేమిస్తావు ఆదరిస్తావు అని ఇక్కడికి వచ్చాను. వచ్చినట్టు గుర్తించవేంటి. నీ లవ్ లో కూడా క్రుయాలిటీ కనిపిస్తోంది. అలాగని నీలో లవ్ లేదని చెప్పటానికి వీలు లేదు. ఎంతో దూరాన్నుంచి వచ్చాను, మాట్లాడితే ఏంటి! అంటే వాడి హృదయంలో ఏదో అజ్ఞానాన్ని కెలుకుతున్నాడు. లోపల ఎక్కడో పని జరుగుతుంది, బయటికి ఏమీ కనపడదు వాడు చేసే పని. మీ కళ్ళకి కనపడదు, చెవులకి వినపడదు. ఆ పని ఏం జరుగుతోందో రిజల్ట్ వచ్చేవరకూ మీకు తెలియదు. రిజల్ట్ వచ్చాక తెలుస్తుంది, అనవసరంగా గురువుని తిట్టి పోసుకున్నాము, ఇక్కడికి తీసుకు రావటానికి మన తిట్లు భరించాడు అని. గురువు భరించక పోతే ఎవడు భరించగలడు. ఒకోసారి గురువుకి మన చేతితోటి విషం ఇస్తే, తిరిగి మనకు ఆయన చేతితోటి పాయసం ఇస్తాడు.

గురువు మిమ్మల్ని అనుగ్రహించినప్పుడు మీ కళ్ళకి కనపడదు, చెవులకి వినపడదు. మీకు తెలియాలి అని కూడా అనుకోడు. ఎందుకంటే గురువు మీ లోపల ఆత్మగా ఉన్నాడు. అందుచేత అనుకోవలసిన అవసరం లేదు. అనుకోవటం వేరు, అవ్వటం వేరు. లోపల ఉండి మీ బలహీనతలు మీకు చూపిస్తాడు. చూపించి, ఆ బలహీనతలలోంచి ఎలా విడుదల పొందాలో మార్గం చూపిస్తాడు, దాని తాలూకు శక్తిని ఇస్తాడు. ముందు ఆ సంకల్పం కలగచేస్తాడు. సంకల్పం కలగచేసేది వల్లీదేవి, ఆ సంకల్పాన్ని ఫుల్ఫిల్ చేసేది దేవయాని (దేవసేన). సుబ్రహ్మణ్యస్వామికి ఇద్దరు భార్యలు అంటే, రెండు శక్తులు అవి. ఇలా అర్థం

చేసుకోవాలి మీరు. మీకు వాసనా రహితం అవ్వాలి, ఈ మనస్సు పెట్టే క్షోభలోంచి బయట పడాలి, ఇదొక పెద్ద ఫారెస్ట్. ఈ సంసారం అనేది పెద్ద అడివి. ఈ అడివిలోంచి బయటికి రావాలని నీకు సంకల్పం తీసుకోచ్చేదే వల్లీదేవి. ఆ సంకల్పానికి శక్తిని ఇచ్చి ఆ సంకల్పం నెరవేరేలా చేసేది దేవయాని (దేవసేన). లోపల నుంచి ఆ శక్తిని కలగచేస్తాడు. శక్తిని కలగచేసి, ఆ అలవాటు వల్ల ఆ బలహీనత వల్ల వచ్చే నష్టాలు ఏమిటో నీకు ఎరుక పరుస్తాడు. నిన్ను ఎడ్యుకేట్ చేస్తాడు.

ఎలా చేస్తాడు? బయటికి ఏమీ తెలియనట్టు ఉంటాడు. పనంతా లోపల చేసుకొంటూ వెళ్ళిపోతాడు. ఆయన చేసిన ఉపకారం ఒకవేళ ఎప్పుడైనా తెలుస్తుంది అనుకోండి మీకు, మీరు మాకు ఎంత ఉపకారం చేసారో అని మనం అంటే, నాకేమీ తెలియదు అని చెపుతాడు. వాడు ట్రూ గురు! ఎందుచేతంటే వాడికి మీ గుర్తింపు అక్కరలేదు. గుర్తింపుల వల్ల అహంకారం వస్తుంది. ఏది పోగొట్టుకోవాలో దానిని పెంచుకోకూడదు. గుర్తింపులు కోరామా, అజ్ఞానం పెరిగిపోతుంది. ఒక్కమాట గుర్తు పెట్టుకోండి. గుర్తింపులు కోరుతూ లోకవాసన తోటి ప్రయాణం చేస్తూ ఎంత ముందుకి వెళ్లిపోయామో, మళ్ళీ అంత వెనక్కి మన మనస్సుని లాక్కుంటేనే కానీ ఆత్మజ్ఞానం రాదు. మీరు అత్తిలి నుంచి వెయ్యి మైళ్ళు వెళ్ళిపోయారు అనుకోండి, మళ్ళీ వెయ్యి మైళ్ళు వెనక్కి వస్తేనే మీరు అత్తిలి వస్తారు కానీ, లేకపోతే రాలేరు. అలాగే చైతన్యాన్ని విడిచిపెట్టి ఆత్మని విడిచిపెట్టి ఎంతదూరం వెళితే అంత దూరం వెనక్కి రావలసిందే. లేకపోతే చైతన్యములో ఐక్యము కాలేరు.

అయితే ముందు మీకు ఏ బలహీనతలు ఉన్నాయో చూపిస్తాడు, చూపించి నిన్ను ఆ వాసనలోంచి విడుదల చెయ్యటానికి ప్రయత్నం చేస్తాడు. ఆ విడుదల పొందే శక్తిని ఇస్తాడు. ఒకవేళ ఆయన విడుదల చెయ్యటానికి ప్రయత్నం చేసినప్పుడు కూడా, ఆయన అనుగ్రహం ఇచ్చేటప్పుడు కూడా, నువ్వు ఆ అలవాటుని, ఆ వాసనని బయటికి కక్కకపోతే, సర్జరీ చేసి తీసేస్తాడు. వాడు గురువు! ఇటు చెప్పినా అటు చెప్పినా నిన్ను ఉద్ధరించే వరకూ విడిచిపెట్టడు. ఈ చుట్టాలు స్నేహితులు ఏముంది, అత్తిలి ఏంటి? ఈ శరీరం ఎంతనిజమో మనం చెప్పుకునే మాటలు కూడా అంతే నిజం. అసలు అంతా లోపలే ఉంది, బయట ఏమీ లేదు. మన అజ్ఞానం వల్ల అక్కడ ఏదో ఉంది, ఇక్కడ ఏదో ఉంది అని ఇలా పరుగుపెడుతున్నాము. మనకి దేహాభిమానం ఉంది, దేహబుద్ధి ఉంది. అందుచేత బయట చూస్తున్నాము. బయట ఏమీ లేదు. కానీ మనకి కోరికలు వాసనలు ఉన్నాయి కాబట్టి

బయట ఏదో ఉంది అనుకొంటాము. అదే మాయ. నీకున్న అలవాట్లని బట్టి, కోరికలని బట్టి బయట ఏదో ఉంది అనుకొంటున్నావు. బయట ఏమీ లేదు. నిజమైన నేనుకి, అచ్చమైన నేనుకు, లోపలా లేదు బయటా లేదు. మనకి అస్తమానూ లోపల గొడవ బయట గొడవ! ఇది అజ్ఞానానికి గుర్తు, అవిద్యకి గుర్తు, బంధానికి గుర్తు, మోక్షానికి చాలా దూరంలో ఉన్నామని అది గుర్తు మనకి. ఆత్మజ్ఞానానికి, ఆత్మవైభవానికి, స్కందుడికి చాలా దూరంగా ఉన్నాము అనడానికి గుర్తు. ఈ దొంగనేను చెపుతుంది కానీ లోపలా బయటా అని, అచ్చమైన నేనుకి లోపల లేదు బయట లేదు. ఉన్నదేదో అది అలా ఉంది. ఈ దొంగనేనే దేహాన్ని చుట్టుకొంటుంది. దేహాన్ని నేను అంటుంది, మనస్సుని నేను అంటుంది, తెలివిని నేను అంటుంది, బుద్ధిని నేను అంటుంది. ఇవన్నీ నువ్వు కాదు. నువ్వు కానిదానితోటి నిన్ను జతకూర్చి నేను అక్కడ ఉన్నాను ఇక్కడ ఉన్నాను లోపల ఉన్నాను బయట ఉన్నాను అని ఈ దొంగ నేను చేసే చేష్టలు. అచ్చమైన నేనుకి లోపలా బయటా లేదు. నేను లోపల ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది, వైకుంఠంలో నారాయణుడు ఉన్నాడు, కైలాసంలో శివుడు ఉన్నాడు. ఆ దొంగనేను ఎంత నిజమో ఇవన్నీ కూడా అంతే నిజం. అచ్చమైన నేనుకి ఈ గొడవ అక్కరలేదు. అది బాడీలెస్, మైండ్ లెస్, వరల్డ్ లెస్ అండ్ గాడె లెస్ ఆల్సో.

జ్ఞానం రావటానికి, శాంతి స్థానం పొందటానికి, సుఖ స్వరూపం పొందటానికి, ఒక్క దేవతా పురుషుడి అనుగ్రహం సరిపోతుంది. దేవతలు చాలా మంది ఉన్నారు కాని, వంద దేవతల అనుగ్రహం మనకి అక్కరలేదు. భగవాన్ చెప్పారు కదా - వన్ వర్డ్ ఈజ్ ఎనఫ్, వన్ లుక్ ఈజ్ ఎనఫ్, వన్ టచ్ ఈజ్ ఎనఫ్! మనవి శవ నేత్రాలు. జ్ఞాని నేత్రాలు శవ నేత్రాలు కాదు. ఎక్కడో మీ హృదయ కుహరంలోకి చూస్తాయి. మన నేత్రాలు చర్మాన్నే చూస్తాయి. జ్ఞాని నేత్రాలు మీ హృదయం యొక్క లోయలలోకి వెళ్లి చూస్తాయి. అక్కడ ఏముందో చూస్తాడు. అక్కడ జ్ఞానం తాలూకు, దైవం తాలూకు ఎరుక ఎందుకు రావటంలేదో చూస్తాడు. అక్కడ ఉన్న డస్టుని కెలుకుతాడు. కెలికి మీ బుద్ధికి చూపించి బయటికి లాగుతాడు. వాడు నిజమైన గురువు, అలా చెయ్యండి, ఇలా చెయ్యండి, అలా కూర్చోండి, ఇలా కూర్చోండి అని నిజమైన గురువు చెప్పడు. బయట నోటితోటి చెప్పకుండా, లోపల ఉండే చేసుకుపోతాడు. ఇట్ ఈజ్ ఏ ట్రూ ఐ, ఇట్ ఈజ్ ఏ లాయల్ ఐ, ఇట్ ఈజ్ ఏ కింగ్లీ ఐ!

మనము నిజమైన నేను అంటాము, నిజమైన నేను పరమాత్మే. ఇప్పుడు మనం

చెప్పే నేను దేహానికే పరిమితం అయ్యి ఉంటుంది అంతే. బయట ఏదో ఉంది అని చెప్పేది కూడా ఈ దొంగ నేనే. ట్రూ ఐ ని తెలుగులో అనువాదం చేసేటప్పుడు, విశ్వనాథ సత్యనారాయణ గారు నిజమైన నేను అనలేదు, అచ్చమైన నేను, అంటూసొంటూ లేని నేను. అంటే దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన, శుభవాసనలు అశుభవాసనలు తోటి సంబంధం లేకుండా స్వచ్ఛముగా ఉండే నేను, అచ్చమైన నేను అని తెలుగు భాషలో అనువాదం చేసారు.

మీకు రోగం ఉన్నంత సేపు వైద్యుడు అవసరమే. నువ్వు అజ్ఞానంలో, అవిద్యలో, అహంకారంలో కాలిపోతున్నంత కాలం గురువు అవసరమే. ఎప్పుడూ గుర్తు పెట్టుకోండి, శారీరకమైన బాధ కంటే, మానసికమైన అశాంతి భరించటం కష్టం. మనస్సుకి వచ్చే వేదన, మనస్సుకి వచ్చే అశాంతి భరించటం చాలా  కష్టం. అందుచేత మీకు రోగం ఉన్నంత సేపు వైద్యుడు అవసరమే. నీ ఇంద్రియాలు నీ మనస్సు, అవిద్య అనేది పెద్ద అడివి ఇది - ఈ ఫారెస్ట్ లో నువ్వు ఎంతకాలం అయితే పడి కాలిపోతున్నావో అంత కాలం నిన్ను గైడ్ చెయ్యటానికి నీకు గురువు అవసరం.

మీ లోపల ఈశ్వరుడు ఉన్నాడు, ప్రభువు ఉన్నాడు. మన యజమాని ఇక్కడినుంచే కంట్రోల్ చేస్తున్నాడు. మిమ్మల్ని కంట్రోల్ చేసే వాడు వైకుంఠంలో లేడు, ఇక్కడే ఉన్నాడు. మీ శరీరం ఎప్పుడు ఎక్కడ ఉండాలి ఆయనే కంట్రోల్ చేస్తూ ఉంటాడు. మనం చాలా జాగ్రత్తగా ఉండాలి అనుకుంటాము, చాలా జాగ్రత్తగా మాట్లాడాలి అనుకుంటాము. కానీ ఒకోసారి మనకి పొరపాటు మాట వచ్చేస్తుంది. పొరపాటు మాట మీ నోటివెంట రావటానికి, భగవంతుడు అది మీ చేత కక్కిస్తాడు. అది కూడా వాడు కంట్రోల్ చేస్తూ ఉంటాడు. మనం జాగ్రత్తగా మాట్లాడాలి అనుకొంటే, ఒకోసారి మాటలు జారిపోతాయి, స్లిప్ అవుతాయి. వీటి కంట్రోలర్ ఇక్కడే ఉన్నాడు. నీ శరీరం ఎక్కడ ఉండాలి, నీ మనస్సు ఎక్కడ ఉండాలి, నీ దేహప్రారబ్ధాన్ని బట్టి ఏ రోజున చనిపోవాలి, ఏ రోజున సంపద రావాలి  ఏ రోజున ఆపద రావాలి వీటినన్నింటిని కంట్రోల్ చేస్తాడు. సంపదలు, ఆపదలు. కష్టాలు కూడా కొన్ని అనుభవాలు నేర్పుతాయి. మనం సుఖంలో ఉన్నప్పుడు కంటే దుఃఖంలో ఉన్నప్పుడే దేవుడు ఎక్కువ జ్ఞాపకం వస్తాడు. మీకు దారిద్ర్యం ఎప్పుడైనా వచ్చిందనుకోండి, అది కూడా ఈశ్వరుడు ఎందుకు పెడతాడో మనకు తెలియదు.  మనకు పాఠాలు నేర్పటానికే ఇవి అన్నీ చేస్తూ ఉంటాడు.

నలభై ఏళ్ల క్రిందట భీమవరంలో ఒక షావుకారుగారు సైకిల్ మీద తిరిగి బిస్కట్లు

అమ్ముకొనేవాడు. సైకిలుకి పాచ్ పడితే డబ్బులు ఇవ్వలేక రేపు ఇస్తాను అనేవాడట ఆ సైకిల్ షాపు వాడికి. వాడు ఇప్పుడు కాకినాడలో సంవత్సరానికి నలభై లక్షలు దానధర్మాలు చేస్తున్నాడు. అది భీమవరంలో ఉన్న పరిస్థితి, ఇది కాకినాడలో ఉన్న పరిస్థితి. పొద్దునే రెండు ఇడ్లీలు తినటానికి డబ్బులు లేక, ఒక ఇడ్లీ తిని కాఫీ తాగేవాడు. ఆ దేహాన్ని భగవంతుడు అక్కడ అలా పెట్టాడు ఇక్కడ ఇలా పెట్టాడు. జీవకోటిని ఎందుకు ఎలా ఆడిస్తున్నాడో మనకు తెలియదు.

రమణమహర్షి గారు పూర్వజన్మలు రాబోయే జన్మలు గొడవలు వద్దు, టైం వేస్ట్ చేసుకోవద్దు అంటారు. జన్మలు అన్నీ అబద్దాలే. మనకి రకరకాల స్వప్నాలు వస్తాయి. మనకి మెలుకువ వచ్చేవరకూ స్వప్నంలో వచ్చే గొడవలు నిజం అనుకొంటాము. అలాగే మీ హృదయంలో మేల్కొనేవరకూ ఈ జన్మలు, ఈ చావులు, ఈ అత్తిలి, దేవతలు, లాభాలు నష్టాలు, కష్టాలు దుఃఖాలు బాధలు, భారాలు, ఇవ్వన్నీ నిజమనుకొంటారు, వీటిని మీరు భరించలేకపోతున్నారు. మీరు హృదయంలో మేల్కొన్నాక, జ్ఞానం కలిగాక తెలుస్తుంది ఏమీ లేని దానికి ఇంత బాధ పడ్డాము అని. ఆలోచించి చూస్తే ఏమీ లేదు, ఇంత క్షోభ పడ్డావేంటి అనిపిస్తుంది. ఇప్పుడు తెలియదు, జ్ఞానంలోకి మెలుకువ వచ్చాక అప్పుడు మీకు తెలుస్తుంది.

భగవాన్ కొంతమందిని స్నానం చేసారా భోజనం చేసారా అని అడిగేవాడు, ఇంకో కొంతమందిని ఊరికే చూసేవాడు, మాట్లాడేవాడు కాదు. వాళ్లని పలకరిస్తున్నాడు, మనని పలకరించటం లేదు అని మనకు అనిపిస్తుంది. మన లోపల ఉన్న వాసనలు కదపటానికి వాడు చేసే ప్రక్రియ అని మనకి తెలియదు. ఒకళ్ల తోటి మాట్లాడి ఇంకొకళ్లతో మాట్లాడక పోతే వాళ్లకి కోపం వచ్చేస్తుంది కదా! వాళ్లకి ఎంత కోపం ఉందో వాళ్ల మెదడులో చూపించటానికి ఇటువంటి సన్నివేశాలు అన్నీ కావాలని చేసేవాడు. ఒకోసారి దగ్గరగా కూర్చున్న వాళ్ల వంక చూసేవాడు కాదు, ఎక్కడో ఆ చివర కూర్చున్న వాళ్లని చూసి వాళ్లని అడిగేవాడు మీరు భోజనం చేసారా, స్నానం చేసావా అని. ఎదురుగా కూర్చున్న వాళ్లకి వళ్ళు మండిపోతుంది. వాళ్లకి వళ్ళు మండిపోవాలనే ఈ పనులు అన్నీ ఆయన చేసేవాడు. ఆ మంట అంతా బయటికి వచ్చేయాలని. ఒకోసారి చివర కూర్చున్న వాళ్లని పిలిచి వాళ్లని మర్యాద చేసేవాడు. ఎదురుగా కూర్చున్న వాళ్లని వదిలేసేవాడు. దీనికంతటికీ ఏదో ఒక కారణం ఉంటుంది. ఆ కారణం మనకి తెలియదు. ఇవన్నీ కూడా ఎక్కడికో మనల్ని మేల్కొలపటానికి చేస్తున్నటువంటి పనులు. ఆ మేల్కొలపటానికి ఏమి అడ్డు వస్తునాయో అది మనకి తెలియపరచటానికి చేసేవాడు. అందుచేత ఆయన కోపము కూడా ఆయన అనుగ్రహమే అని గుర్తించిన వాళ్ళు ధన్యులు.

# వైకుంఠ ఏకాదశి / మోక్ష ఏకాదశి

## శ్రీ నాన్నగారి మాటలలో వైకుంఠ ఏకాదశి యొక్క విశిష్టత, ఆహార నియమంతో ఆధ్యాత్మిక లాభం

ఈ రోజు వైకుంఠ ఏకాదశి. వైకుంఠ ఏకాదశినే ముక్కోటి ఏకాదశి అంటారు. మోక్ష ఏకాదశి అని కొంతమంది అంటారు.

సాంప్రదాయం ఏమిటంటే మనకి సంవత్సరానికి 24 ఏకాదశిలు వస్తాయి. కొంతమంది అన్ని ఏకాదశిలు చాల బాగా చేస్తారు. మిగతా ఏకాదశిలు అంత శ్రద్ధగా చేసినా చెయ్యకపోయినా, ముక్కోటి ఏకాదశి మాత్రం అందరూ చాలా శ్రద్ధగా చేస్తారు. మహావిష్ణువు తొలి ఏకాదశి రోజున, అంటే మొట్టమొదటి ఏకాదశి రోజున, యోగనిద్రలోకి వెళతాడు. వైకుంఠ ఏకాదశి రోజున నిద్ర లేస్తాడు. ఈ ఏకాదశి రోజున వైకుంఠంలో మేల్కొని, ఉత్తరద్వారం ద్వారా మూడు కోట్ల దేవతలకు దర్శనం ఇస్తాడు. మూడు కోట్ల దేవతలకు దర్శనం ఇస్తాడు కాబట్టి దీనిని ముక్కోటి ఏకాదశి అంటారు, వైకుంఠంలో దర్శనం ఇచ్చాడు కాబట్టి వైకుంఠ ఏకాదశి అంటారు. అంటే శ్రీ మహావిష్ణువు యోగనిద్రలోనుంచి ఈ రోజు మేల్కొన్నాడు.

ఉత్తరద్వారం మోక్షద్వారం అని, ఉత్తరద్వారం ద్వారా విష్ణువు యొక్క ఆలయంలోకి వెళ్లి నారాయణుడి దర్శనం చేసుకుంటారు. ఈ రోజున 24 గంటలు ఉత్తరద్వారం ద్వారా దర్శనం ఉంటుంది. తిరుపతి తిరుమలలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తరద్వారం ఈ రోజు తెరుస్తారు. ఈ ఒక్క రోజే ఉత్తరద్వారం ద్వారా వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లనిస్తారు. మిగతా 364 రోజులు ఉత్తరద్వారం మూసేస్తారు. భద్రాచలంలో కూడా ఈ రోజు ఉత్తరద్వారం గుండా రామచంద్రమూర్తిని దర్శించనిస్తారు.

సర్వసాధారణంగా ఈ రోజున తెల్లవారుజామున లేచి, స్నానం చేసి, మహావిష్ణువు యొక్క ఆలయాలకు వెళ్తారు. సాధ్యమైనంత వరకూ ఈ రోజున అందరూ ఉపవాసం ఉంటారు. ప్రతీ ఏకాదశి అవలంబించినా అవలంబించక పోయినా, ఈ రెండు రోజులు మట్టుకు తప్పనిసరిగా భక్తులు ఉపవాసం ఉంటారు. ఒకటి శివరాత్రి, రెండు ముక్కోటి ఏకాదశి. శైవులు శివరాత్రిని ఎంత బాగా చేస్తారో, వైష్ణవులు ఈ వైకుంఠఏకాదశిని అంత బాగా చేస్తారు.

ఉపవాసం అంటే మన పొట్టకి రెస్ట్ ఇస్తున్నాము. మన పొట్ట రోజూ తిని తిని అలిసిపోతుంది. ముక్కోటి ఏకాదశి రోజున మన పేగులకి విశ్రాంతిగా ఉంటుంది. తరువాత ఈ రోజున ఉపవాసం ఉంటే ఆరోగ్యానికి మంచిది. కొంతమంది ఎంత నిష్టగా ఈ ముక్కోటి ఏకాదశి చేస్తారంటే, నీళ్ళు కూడా నోట్లో పోసుకోరు - నిర్జలం,అంటే జలం కూడా నోటిలో పోసుకోరు. ఒక వేళ రోజంతా ఉండలేక పోయినవాళ్ళు సాయంత్రం భోజనం చేయవచ్చును. ప్రొద్దుటి పూట అయినా భోజనం మానేసి సాయంత్రం భోజనం చేయవచ్చు. పూర్తి

ఉపవాసం ఉండటం కుదరని వాళ్ళు అగ్నితోటి సంబంధం ఉన్నవి తినకూడదు. పళ్ళు తినవచ్చు, మంచినీళ్ళు తాగవచ్చు. కాసిన నీళ్ళు త్రాగకూడదు. అగ్నితో సంపర్కం ఉన్న ఏ వస్తువూ తీసుకోకూడదు ఉపవాసం ఉన్న రోజున.

ఉపవాసం అంటే, మామూలుగా నిరాహారంగా ఉండటం అని ఒక అర్థం. ఉప-వాసం అంటే నీలోపల హృదయంలో ఉన్న పరమాత్మకి సమీపంగా ఉండమని. దగ్గరగా వాసం చేయమని, అంటే నివసించమని. ఈ రోజున ఏమైనా కొద్దిగా సరిపడి తిన్నా, నీ లోపలఉన్న నారాయణుడికి సమీపంగా జీవించటం నేర్చుకోమని. ఉప-వాసం అంటే అంతర్యామి అయినటువంటి నారాయణుడికి సమీపంలో నివసించమని చెప్పటం.

మీరు ఒకటి గుర్తు పెట్టుకోండి. మీలో జపాలు చేసిన వాళ్ళు ఉన్నారు, ధ్యానాలు చేసిన వాళ్ళు ఉన్నారు. ఇవన్నీ మీ పద్ధతిలో మీరు చేసుకొంటున్నారు. అన్నిటికంటే గొప్ప నియమం ఏమిటంటే, ఆహార నియమము. ఈ జపాల కంటే, ధ్యానాల కంటే, పూజల కంటే, గుళ్ళోకి వెళ్లి రావటం కంటే, వీటన్నిటి లోకి గొప్ప నియమం, ఆహార నియమం. ఆహార నియమానికి మించిన నియమం లేదు. భగవద్గీతని మించిన గ్రంథం ఎలాగ లేదో, ఆహారనియమానికి మించినటువంటి నియమం లేదు. మీరు ఆహారంలో నూనె సరుకులు తినకుండా, శరీరానికి ఏమి పడవో మీరు చూసుకొంటూ, మీరు తిండి విషయంలో జాగ్రత్తగా ఉంటే, ఆధ్యాత్మికంగా నూటికి యాభై మార్కులు వచ్చేస్తాయి. ఈ జప ధ్యానాల వల్ల 5 మార్కులు 10 మార్కులు కంటే ఎక్కువ రావు. ఒక్క ఆహార నియమం వల్ల నూటికి 50 మార్కులు వస్తాయి.

అందుచేత ఆహారనియమం లేని వాళ్ళు సాధన చేసినా ఆధ్యాత్మికంగా అభివృద్ధి లోకి రాలేరు. తిండిమీద కాంక్ష ఉన్నా, భక్తులు నా కోసం ఆ కాంక్ష విడిచిపెడతారు అన్నాడు కృష్ణుడు గీతలో. అందరూ విడిచిపెడతారు అని చెప్పలేదు. నా భక్తులు వాళ్లకి ఆ ఇష్టం ఉన్నా, నా కోసం విడిచిపెడతారు అన్నాడు. ఆధ్యాత్మికంగా అభివృద్ధి లోకి రావాలంటే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మన శరీరానికి పడనివి, నూనె సరుకులు, శరీరానికి వేడి చేసే పదార్థాలు ఎక్కువ తినకూడదు. పలావులు అవీ శరీరానికి ఉపద్రవం తీసుకొస్తాయి. మనస్సుని సాధన చేయనివ్వవు అవి. ఒక్క ఆహారనియమం వల్ల మానసికఆరోగ్యం శారీరక ఆరోగ్యం, రెండూ వస్తాయి. గ్రంథములు అన్నిటి లోకి భగవద్గీత ఎంత గొప్పదో, నియమములు అన్నిటిలోకి ఆహారనియమం అంత గొప్పది. సినిమాలకి వెళ్తే భక్తి పాడవుతుందని కొంతమంది వెళ్లరు. ఇవన్నీ మంచివే కాని అన్నిటిలోకి ఆహారనియమం గొప్పది. ఆహారనియమం ఉన్న వాడు అభివృద్ధిలోకి వస్తాడు అని ఒక సామెత, అదీ విశేషం.

**నారాయణా నారాయణా ఓం నమో నారాయణాయ.**

**ఓం నమో భగవతే వాసుదేవాయ.**



# అరుణాచల మహత్త్యం
# అక్షరమణమాల

**నీవు నే నణుగ నిత్యానంద మయముగ**
**నిలుచు స్థితి కరుణింపు అరుణాచలా!**

**తాత్పర్యము:** "నీవు వేరు - నేను వేరు" అనే ద్వైతబుద్ధి నశించి నిత్యమైన సత్యమైన ఆత్మానందములో నిరంతరము నేను నిలిచిపోయేటట్లు అనుగ్రహించు అరుణాచలా!

నేను అణిగిపోతాను, నువ్వు కూడా అణిగిపో. నీ వేషం నువ్వు తీసేయి నా వేషం నేను తీసేస్తాను. ఇద్దరమూ ఒకటి అయిపోతాము. ఈ వేషాలు తీసేద్దాము. నువ్వు దేవుడి వేషం వేసావు, నేను జీవుడి వేషం వేసాను. కానీ ఉన్నది ఒకటే. ఈ దేవుడికి జీవుడికి ఆధారంగా ఉన్నది ఒక్కటే. ఈ వేషాలు తీసివేస్తే, ఉన్నది ఒక్కటంటే ఒక్కటే అన్న సంగతి అనుభవంలోకి వస్తుంది.

నీవు నేను అణగ - నేను ఎలాగో అణిగిపోతాను, నువ్వు కూడా అణిగిపో. అప్పుడు బ్లిస్ అనుభవంలోకి వస్తుంది. వేరుబుద్ధిలో, సెపరేట్నెస్ లో, నీకు బ్లిస్ తెలియదు. వన్ నెస్ లోంచి నీకు పీస్ వస్తుంది, బ్లిస్ వస్తుంది. సెపెరేట్ నెస్ లోంచి బ్లిస్ రాదు. నువ్వు వేరు నేను వేరు అనే బేధబుద్ధి ఉన్నప్పుడు ఇంకొక ప్రమాదం ఉంది ఏదో ఒకటి అడగాలి అనిపిస్తుంది. ఉన్నది ఒక్కటే అయితే ఇంక అడిగేది ఏమీలేదు. ఈ ప్రపంచం తోటి, దేవుడి తోటి, నీకు బేధబుద్ధి ఎప్పుడైతే కంప్లీట్‌గా పోయిందో లోపల ఉన్న నిజమైన ఆనందం పొంగుతుంది. అది స్వతంత్రమైనది అది మనుషుల మీద కాని, ప్రపంచం మీద కాని, చావు పుట్టుకల మీద కాని, బాహ్యమైన సంపదల మీద కాని, ఆధారపడింది కాదు. అది స్వతంత్రమైన ఆనందం, స్వతంత్రమైన శాంతి. దానికి శరీరం యొక్క చావుతో సంబంధం లేదు, శరీరం చనిపోయినా ఆ ఆనందం, ఆ పీస్, కంటిన్యూ అయిపోతుంది.

ఏసు బైబిల్‌లో 'ఉన్నాను, ఆ ఉన్నది నేనై ఉన్నాను' అంటాడు. అది ట్రూ ఐ! నేను యెహోవా లేనప్పుడు కూడా ఉన్నాను, దేవుడు లేనప్పుడు కూడా నేను ఉన్నాను. తండ్రి

లేకుండా కుమారుడు ముందు ఎలా ఉంటాడు? యెహూవా తండ్రి, ఈయనేమో కుమారుడు. ఈయన ఏమంటున్నాడు అంటే, నేను ఉన్నాను, ఆ ఉన్నదేదో తండ్రి లేనప్పుడు, సృష్టి లేనప్పుడు కూడా ఉంది. అది నేనై ఉన్నాను. యెహోవా లేనప్పుడు కూడా నేను ఉన్నాను, ప్రపంచం లేనప్పుడు కూడా నేను ఉన్నాను. అది బాడిలెస్, మైండ్ లెస్, వరల్డ్ లెస్, ఎవ్వెరితింగ్ లెస్. అయితే అది లేదా అంటే ఉంది. దానిని అదే ఎంజాయ్ చేస్తూ ఉంటుంది. దానిని ఎంజాయ్ చెయ్యటానికి నువ్వు ఏమీ మిగుల్చుకోనక్కరలేదు. ఎంజాయర్ అక్కరలేదు, ప్రత్యేకంగా ఎంజాయరుని పెట్టుకోకు నువ్వు. యెహూవా లేనప్పుడు, ప్రపంచం లేనప్పుడు, దేవుడు లేనప్పుడు కూడా నేను ఉన్నాను, అని చెప్పి, మళ్ళీ ఆ ఉన్నదేదో నేనై ఉన్నాను. అదే సత్యం. బైబిలులో ఎంత కరెక్టుగా చెప్పాడు ఏసు అని భగవాన్ ఈ వాక్యానికి ఆశ్చర్యపోయారు.

"నీవు నేను అణగ నిత్య ఆనంద మయముగ" - ఇది బ్రోకెన్ హేపీనెస్ కాదు, పెర్మనెంట్ హేపీనెస్, ఎటర్నల్ హేపీనెస్, ఎటర్నల్ లవ్! "నిత్య ఆనంద మయముగ" - నిన్న బాగానే ఉందండీ, ఈవేళ బాగాలేదు! నిన్న మనస్సు బాగానే ఉందండీ ఈవేళ బొత్తిగా పుండు అయిపోయింది - ఇటువంటిది కాదు అది! "నిత్య ఆనంద మయముగ" - ఆల్వేస్ అండ్ ఎటర్నల్ లవ్. అక్కడికి తీసుకుపోతున్నాడు. అక్కడ చీకటి లేదు, అక్కడ రాత్రి లేదు, పగలు లేదు, అక్కడ సూర్యుడు లేదు, చంద్రుడు లేదు, అక్కడ అన్నీ అలౌకికం, లౌకికం కాదు, అలౌకికం! అది భౌతికం కాదు, అభౌతికం. అక్కడికి తీసుకు పోతున్నాడు. కళ్ళున్న వాళ్ళు చూడండి, చెవులు ఉన్న వాళ్ళు వినండి, హృదయం యొక్క లోతుల్లోకి తీసుకు పోతున్నాడు.

ఉపనిషత్తులు చదువుకున్న వాళ్ళు, వేదాలు చదువుకున్న వాళ్ళు ఉన్నారు, ఇంత చిన్న చిన్న మాటలలో, ఇంత బ్యూటిఫుల్ వాక్యాలలో ఇటువంటి ఎక్సెలెంట్ వర్డ్స్‌లో మీకు ఏ ఉపనిషత్తులో ఉంటుంది! "నీవు నేను అణగ నిత్య ఆనంద మయముగ", అంటే బ్రోకెన్ హేపీనెస్ కాదు. "నిత్య ఆనంద మయముగ నిలుచు స్థితి కరుణింపు అరుణాచాలా!" రస హృదయం ఉన్న వాళ్ళు ఈ పోయెట్రీని ఆనందించండి.

బుద్ధిమంతుడు అంటే నువ్వు ఏ కులంలో పుట్టినా, ఏ మతంలో ఉన్నా, ఒక మంచి వాక్యం నీ నోటినుండి వచ్చినప్పుడు దానిని ఎంజాయ్ చేస్తాడు. కాని అలా ఎంజాయ్ చెయ్యకపోతే వాడు బుద్ధిమంతుడు కాదు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ మన వాడు కాదు, కానీ ఆయనను మనం ఎంజాయ్ చేస్తున్నాము కదా.

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు నాకు కవిత్వం పుట్టలోంచి పాము వచ్చినట్టు వచ్చింది, చుట్టం వచ్చి తలుపు తట్టినట్టు వచ్చింది అన్నారు. అలాగ అంత సహజంగా మీకు కూడా జ్ఞానం రావాలి. అరుణాచలేశ్వరుడి అనుగ్రహం ఉంటే అది సాధ్యమే. కృష్ణశాస్త్రిగారికి కవిత్వం ఎంత సహజంగా వచ్చిందో, అంత సహజంగా ఆత్మజ్ఞానం మిమ్మల్ని వరించాలి.



# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

నాగమహాశయుడు శ్రీ రామకృష్ణ పరమహంస గృహస్థ భక్తులలో అతిముఖ్యుడు. రామకృష్ణుడికి వివేకానందుడికి మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, నాగ మహాశయుడు భగవద్గీతలో ఒక వాక్యం చెపుతాడు. ఈ శ్లోకానికి నాన్నగారి మాటలలో వివరణ:

**యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ।**
**యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునే॥**

**తాత్పర్యము:** నిత్య జ్ఞాన స్వరూప పరమానంద ప్రాప్తి యందు స్థితప్రజ్ఞుడైన యోగి మేల్కొనియుండును. అది ఇతర ప్రాణులన్నింటికిని రాత్రితో సమానము. అశ్వరమైన ప్రాపంచిక సుఖ ప్రాప్తికై ప్రాకులాడుచు ప్రాణులన్నియు మేల్కొని యుండును. అది పరమాత్మ తత్త్వము నెరిగిన మునికి రాత్రితో సమానము.

అజ్ఞానికి ఏది రాత్రో జ్ఞానికి అది పగలు. ఇది జాగ్రత్తగా వినండి. అజ్ఞానికి ఏది రాత్రో, జ్ఞానికి అది పగలు. అంటే ఆత్మ జ్ఞానం ఎలా ఉంటుంది, ఆ నోబుల్ థాట్స్ ఎలా ఉంటాయి, ఆ సెల్ఫ్‌లెస్ థాట్స్ ఎలా ఉంటాయి, ఆ సహృదయం సద్బుద్ధి ఎలా ఉంటుంది, ఆ సముద్రం లాంటి హృదయం ఎలా ఉంటుంది, అది అంతా అజ్ఞానికి తెలియదు. ఆత్మజ్ఞానం, అజ్ఞానికి రాత్రి లాంటిది. ఒక అజ్ఞాని పక్కన వచ్చి ఆత్మజ్ఞాని కూర్చున్నా, వాడు చూడలేడు కాబట్టి అది వాడికి రాత్రి తోటి సమానం. అలాగే ఒక జ్ఞాని దగ్గరకు భోగ ప్రవృత్తి ఉన్న మనిషి వచ్చి కూర్చున్నా జ్ఞానికి ఆ భోగప్రవృత్తి కనపడదు. వాడిలో ఉన్న జ్ఞానమునే చూస్తూ ఉంటాడు. అందుచేత అజ్ఞానిలో ఉన్న భోగ ప్రవృత్తి, అజ్ఞానిలో ఉన్నటువంటి స్వార్థము, అజ్ఞానిలో ఉన్నటువంటి దేహాత్మబుద్ధి, అజ్ఞానిలో ఉన్నటువంటి ఆ దేహభావన, అన్నీ కూడా జ్ఞానికి రాత్రి లాంటివి. వాళ్ళిద్దరూ పక్క పక్కనే కూర్చున్నా, అజ్ఞాని అనుభవించే భోగాలు అన్నీ కూడా జ్ఞానికి రాత్రి లాంటివి. ఇది బాగా వినండి మీరు, కన్‌ఫ్యూజన్ పడవద్దు. జ్ఞానిలో ఉన్న ఆత్మజ్ఞానం అజ్ఞానికి రాత్రి లాంటిది. అజ్ఞాని అనుభవించే భోగ ప్రవృత్తి జ్ఞానికి రాత్రి లాంటిది. ఆత్మజ్ఞానము

అజ్ఞానికి కనపడదు. భోగప్రవృత్తి జ్ఞానికి కనపడదు.

ఇది భగవద్గీత రెండవ అధ్యాయంలో వివరంగా చెపితే, దానిని నరేంద్రుడికి అన్వయిస్తూ నాగమహాశయుడు చెపుతాడు - నరేన్ నీ కూడా తిరిగేవాళ్ళు ఎంతమంది నిన్ను అర్థం చేసుకున్నారు. నీ పక్కన సన్యాసులు చాలా మంది ఉన్నారు. ఈ సన్యాసులు ఎవరూ నిన్ను అర్థం చేసుకోలేదు. ఊరికే కూడా తిరుగుతున్నారు అంతే కాని నిన్ను అర్థం చేసుకోలేదు. రామకృష్ణుడు మట్టుకు నిన్ను అర్థం చేసుకున్నాడు. రామకృష్ణుడే వివేకానందుడు, వివేకానందుడే రామకృష్ణుడు! అందుచేత నిన్ను ప్రోపర్‌గా అర్థం చేసుకున్న వాడు రామకృష్ణుడు ఒక్కడే. నీ గురించి ఏ మాటలు అయితే రామకృష్ణుడు చెప్పాడో ఆ మాటలు వీళ్ళు చిలకపలుకులు క్రింద వల్లిస్తున్నారు కాని, వీళ్ళు స్వతంత్రంగా ఆలోచించి నీ గురించి చెప్పే వాక్యం ఒక్కటి కూడా లేదు. అది వాళ్ళ తప్పు కాదు, ఎందుచేత అంటే నువ్వు ఉన్న స్థితి వాళ్లకి రాత్రి భాగం లాంటిది. నాగమహాశయుడు వివేకానంద తోటి చెపుతాడు ఈ మాటలు.

అంటే ఒక జ్ఞానికి ఒక అజ్ఞానికి మధ్యన స్నేహం ఉండవచ్చు కాని, జ్ఞాని యొక్క స్థితిని అజ్ఞాని ఎన్నడూ అర్థం చేసుకోలేడు. కటిక చీకటిలో, ఒక డార్కెస్ట్ నైట్‌లో, నీకు కళ్ళు ఉన్నప్పటికీ ఆ వస్తువు నీకు ఎలా కనపడదో, ఒక మహాజ్ఞాని నీ పక్కన కూర్చున్నప్పటికీ వాడి హృదయం నీకు అర్థం కాదు. అంటే నీలో ఉన్న చీకటి అక్కడ అర్థం చేసుకోవటానికి అవకాశం ఇవ్వదు. అక్కడ ఏది అడ్డు వస్తుంది? నీ కోరిక అడ్డు రావచ్చు, ద్వేషం అడ్డు రావచ్చు, కోపం అడ్డు రావచ్చు. ఏదో అడ్డు వస్తుంది. మొత్తం మీద చీకటిలో ఉన్న వస్తువు నీ కళ్ళకి కనపడదు. అది ఉన్నా, చీకటి కనపడనివ్వదు మీకు. అదే విధంగా, ఒక జ్ఞానిలో ఉన్న ఔన్నత్యాన్ని నీలో ఉన్నటువంటి స్వార్థం, నీలో ఉన్నటువంటి అసూయ దానిని చూడనివ్వదు. అందుచేత నిన్ను అర్థం చేసుకున్నది రామకృష్ణుడు ఒక్కడే. వీళ్ళు నిన్ను అర్థం చేసుకుని నీ గురించి చెప్పటం లేదు, రామకృష్ణుడు చెప్పిన మాటలు చిలకపలుకులు పలుకుతున్నారు అన్నాడు నాగమహాశయుడు.

**వివేకానందుడికి భగవద్గీతలో ఫేవరేట్ శ్లోకం "క్షుద్రం హృదయ దౌర్భాల్యం.." అన్నిటికంటే నీచమైనది హృదయ దౌర్భాల్యమే. హృదయంలో ఉన్న పిరికితనమే అన్నిటికంటే నీచమైనది. నువ్వు పొరపాటు చేస్తున్నావు అంటే భయం వల్ల చేస్తున్నావు నువ్వు తప్పులు చేస్తున్నావు అంటే భయం వల్ల చేస్తున్నావు నీకు మరణం వస్తోంది అంటే భయం వల్ల వస్తోంది. నీకు ఏ చెడ్డ జరిగినా నీకు భయం వల్లే వస్తోంది అందుచేత నువ్వు భయపడకు. మానవుడికి, సమాజానికి ఏ చెడ్డ జరిగినా అది భయం లోంచే పుట్టుకు వస్తోంది కాబట్టి నువ్వు దేనికీ భయపడ వలసిన పని లేదు. ఏదైతే నువ్వు మంచి అనుకొంటున్నావో, ఏదైతే నువ్వు త్రికరణ శుద్ధిగా నమ్మావో, ఏ ఐడియల్ని అయితే నువ్వు పెట్టుకున్నావో ఆ ఐడియల్ కోసం నువ్వు జీవించు మరణించు అంటున్నాడు వివేకానందుడు. ఎదుటివాళ్ళ కోసం నువ్వు బ్రతకకు, ఎదుటివాళ్ళు ఏమనుకొంటే నీకు లెక్క ఏమిటి, ఆకాశాన్ని చూసి కుక్కలు మొరుగుతాయి, నీకేంటి అన్నాడు.**



# స్వామి వివేకానంద

జనవరి 12వ తేదీ స్వామి వివేకానంద జయంతి. మన భారతమాత గర్భంలో జన్మించినటువంటి మహాత్ములలో వివేకానందుడు ఒకడు, అంటారు శ్రీ నాన్నగారు. వివేకానందుడి గొప్పతనం నాన్నగారి మాటలలో .....

రామకృష్ణుడు వివేకానందుడు నరనారాయణులు అని, నారాయణుడు రామకృష్ణుడిగా వస్తే నరుడు నరేంద్రుడిగా, అంటే వివేకానందగా వచ్చాడని రామకృష్ణమిషనులో వాళ్ళ విశ్వాసం. మానవజాతిని ముందుకి తీసుకెళ్లటం కోసం కృష్ణార్జునులే ఇలా అవతరించారు అని శ్రీ రామకృష్ణుడే స్వయంగా చెప్పారు. వాళ్ళ మధ్య ఆప్యాయత ఆ జన్మకి సంబంధించిందే కాదు, అది జన్మాంతర అనుబంధం, అది ఒక జన్మది అయితే ఆ ప్రీతి పుట్టదు.

నరేంద్రుడు 6వ తరగతి చదువుతున్న రోజులలో ఒక దేవుని పటం కొనుక్కొని ఇంటికి తెచ్చుకొంటున్నాడు. దారిలో రోడ్డుమీద ఒక ముసలావిడ గాల్పుకొట్టి పడిపోయింది. అప్పుడు ఈ దేవుడి పటం రోడ్డు ప్రక్కన పెట్టి ఆవిడకి మంచినీళ్ళు పోస్తున్నాడు. అపచారం దేవుడి పటం అలా రోడ్డుమీద పెట్టకూడదు, దేవుడి పటం క్రిందపెట్టేసి ఆవిడకి సేవ చేస్తున్నావేమిటి అని ఎవరో అన్నారట. పటంలో ఉన్న దేవుడికి కాదు బ్రతికున్న దేవుడికి నేను సేవ చేస్తున్నాను అన్నాడట నరేంద్రుడు. వాడు పటంలో దేవుడు, నేను బ్రతుకున్న దేవుడికి సేవ చేస్తున్నాను.

ఎవరు ఏ పనికోసం ఈ భూమి మీదకు వచ్చారో సద్గురువుకి తెలుస్తుంది.

రామకృష్ణుడు చెప్పే మాటలని ఎప్పుడైనా వివేకానంద రాయటానికి ప్రయత్నం చేస్తే నువ్వు ఆగు అనేవాడంట రామకృషుడు. నేను చెప్పే మాటలు రాయటం కోసం నువ్వు రాలేదు నరేన్. ఆ పని కోసం వచ్చినవాడు మహేంద్రనాథ్ గుప్త. నువ్వు చేసే పని వేరుగా ఉంది.

రామకృష్ణుడు కాన్సర్‌తో బాధపడుతుంటే, ఒకపక్కన ఆయనకి సేవ చేస్తూనే, ఈయన గురువు అనేది వాస్తవమా లేకపోతే భ్రాంతా, అని నరేంద్రుడికి సందేహం వచ్చింది. అప్పుడు రామకృష్ణుడు అంటాడు, "నరేన్ ఎవడైతే రాముడో, ఎవడైతే కృష్ణుడో వాడే రామకృష్ణుడుగా ఈ భూమి మీదకి వచ్చాడు.  నేను ఈ రోజున బీదవాడిని అయిపోయాను, నా ఆధ్యాత్మిక శక్తులన్నీ నీకు సంక్రమింపచేసి. నాదగ్గరున్న స్పిరిచ్యువల్ పవర్ అంతా నీకు ప్రసాదించి నేను బీదవాడిని అయిపోయాను నరేన్. నా శరీరం విడిచిపెట్టేసిన తరువాత మన శిష్యులందరికీ నువ్వు నాయకత్వం వహించి వీళ్ళందరినీ అభివృద్ధిలోకి తీసుకొచ్చే బాధ్యత అంతా నీదే" అంటాడు.

దేశంలో ఉన్న దారిద్ర్యాన్ని చూసి నరేంద్రుడు చలించిపోయి, తన శేషజీవితాన్ని అంతా కూడా దేశమాతకి సమర్పించాలనే నిర్ణయానికి వచ్చాడు, దేశం అంతా తిరిగి చూసిన తరువాత, ఆకలితోటి మాడిపోతున్న మనుషులకి నువ్వు మతం గురించి దేవుడి గురించి ఏం చెపుతావు ముందు వాడికి ఆకలి తీర్చి తరువాత భగవద్గీత గురించి చెప్పు అన్నాడు నరేంద్రుడు.

అమెరికాలో చికాగో నగరంలో 1893వ సంవత్సరం సెప్టెంబర్ నెల 11వ తేదీన ప్రపంచ మత మహాసభలో సిస్టర్స్ అండ్ బ్రదర్స్ ఆఫ్ అమెరికా అని సంభోదించి మాట్లాడాడు. అంతకుముందు ఒక అన్నోన్ సన్యాసి, డబ్బుల కోసం ఇబ్బంది పడుతున్నాడు. ఒక గంటలో ప్రపంచ ప్రఖ్యాతి పొందాడు. ఇది గురువు యొక్క కృప.

అమెరికాలో ఐశ్వర్యం చూసి వాళ్ళతో మన ఇండియాని పోల్చుకొని, మన ఇండియాలో ఇంత పావర్టీ ఉందికదా అని, రాత్రుళ్ళు ఏడ్చేవాడట. నువ్వు అమెరికాలో సెటిల్ అయిపో ఎందుకు ఆ పావర్టీ గురించి నీకు, ఎందుకు భారతదేశం వెళ్ళటం అని స్నేహితులు అంటే వివేకానంద అన్నాడట, భారతదేశం యొక్క మట్టే, ఆ భూమే నాకు స్వర్గం. ది సాయిల్ ఆఫ్ ఇండియా ఇజ్ మై హైయెస్ట్ హెవెన్. నాకు స్వర్గం ఎక్కడో లేదు భారత భూమే నాకు స్వర్గం అని చెప్పాడు.

తన యొక్క మేధస్సుని, తన యొక్క బలాన్ని, తన యొక్క పలుకుబడిని, తన ప్రపంచ కీర్తిని అంతా మన భారతదేశం కోసం ఖర్చు పెట్టాడు. మన దేశం యొక్క ఆర్థిక రంగంలో కానీ, రాజకీయ రంగంలో కానీ, సాంఘిక రంగంలో కానీ, మన దేశం యొక్క అన్ని రంగాలలో వివేకానంద ప్రభావం లేని రంగం లేనే లేదు. మేము స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నామంటే ఆయన చెప్పిన మాటలు అర్థం చేసుకొని ఆయన చెప్పిన మాటలు జీర్ణం చేసుకొని, ఆయన చెప్పిన ఉపన్యాసాలు చదివి మేము స్వాతంత్ర సమరంలోకి వచ్చాము అని చెప్పిన నాయకులు మన భారతదేశంలో అనేక మంది ఉన్నారు.

"ఈ భారత దేశంలో ఈ భరతభూమిలో, ఒక మనిషే కాదు, కనీసం ఒక కుక్క, నా కళ్ళకి కనిపిస్తున్నటువంటి ఒక కుక్క ఆకలితోటి బాధపడుతుంటే, నాకు మోక్షం వద్దు, నాకు సిద్ధి వద్దు, నాకు లిబరేషన్ వద్దు. ఈ భారత దేశంలో పుట్టిన ఒక కుక్క ఆకలితోటి బాధ పడుతుంటే దాని ఆకలి తీర్చటం కోసం నేను వెయ్యి సార్లు ఈ భారత భూమి మీద జన్మించటానికి సిద్ధంగా ఉన్నాను" అన్నాడు. వాడు వివేకానందుడు!

ఒకప్రక్క వెస్టర్న్ కంట్రీస్ అభివృద్ధి పొందుతోంటే, అసలు అభివృద్ధి అంటే ఏమిటో తెలియకుండా భారతజాతి అంతా నిద్రపోతుంటే, మొట్టమొదట భారతజాతిని మేల్కొల్పిన వాడు స్వామి వివేకానంద అని జవహర్‌లాల్ నెహ్రూ తన "డిస్కవరీ అఫ్ ఇండియా"లో చెప్పాడు.

వివేకానంద మొత్తం వెస్టర్న్ కంట్రీస్ అన్నీ రెండు సార్లు తిరిగి వచ్చాడు. భోగాలయితే అనుభవిస్తున్నారు కానీ వాళ్ళకి తెలియకుండా వాళ్ళ హృదయాంతరాళాలలో చాలా దుఃఖం కూడా ఉండటం చూసాడు. భాగ్యమూ ధనమూ అవసరమే అయితే జీవితం యొక్క గమ్యం మట్టుకు అది కాదు. మన హిందువులు చెప్పినటువంటిది ఆత్మే గమ్యం, సత్యసాక్షాత్కారమే గమ్యం. అయితే దేశాన్ని భాగ్యవంతంగా ఉంచటం కూడా అంతే అవసరం.

విశ్రాంతి లేని జీవితం గడిపి 1902వ సంవత్సరం జూలై నెల నాలుగవ తేదీ శరీరం విడిచిపెట్టాడు. రోజూ లాగే, గంగ ఒడ్డున ఆ రోజున కూడా షికారుకి వెళ్తూ, కూడా ఉన్న కో-డిసైపిల్‌ని "వివేకానందుడు ఈ లోకానికి వచ్చాడు ఏమి చేసాడు" అని ప్రశ్నించాడు, అయితే అతను ఏమీ మాట్లాడటం లేదు. ఈ లోకంలోకి వివేకానందుడు వచ్చి ఏం పనిచేసి బయటికి వెళ్ళిపోయాడో ఇంకో వివేకానందుడికే తెలుస్తుంది, రాబోయే కాలంలో ఈ

వివేకానంద లాంటి వివేకానందులని భారతదేశం అనేకమందిని చూస్తుంది, మీకు కాకపోయినా వాళ్ళకైనా అర్థం అవుతుందిలే, అన్నాడు. వాడు వివేకానందుడు అంటే!

వివేకానంద భారతదేశానికి ఇచ్చిన మెసేజ్ ఒకటే, మీరు ఏ పని చేసినా నాకు ఇష్టమే, మీరు నిర్భయంగా చెయ్యండి" అన్నాడు. బి ఫియర్లెస్! బి ఫియర్లెస్! ఏ పని చేసినా భయం లేకుండా చెయ్యండి. మీకందరికీ దేవుడిమీద విశ్వాసం కాదు, మీమీద మీకు విశ్వాసం ఉండాలి. నా మీద నాకు విశ్వాసం లేకపోతే, నేను ఏదీ కూడా గొప్ప పని చెయ్యలేను అని చెప్పాడు. బలహీనులకి బద్ధకస్తులకి పిరికివాళ్లకి సత్యం తెలియదు ఆత్మ తెలియబడదు అన్నాడు నరేంద్రుడు.

వివేకానంద స్వామి యొక్క ఋణం మనము తీర్చుకోలేము. ఆయన గ్రేట్ ఆరేటర్, గ్రేట్ రైటర్, గ్రేట్ టీచర్, గ్రేట్ సోషల్ రిఫార్మర్, గ్రేట్ పేట్రియాట్, దేశభక్తులకి దేశ భక్తుడు, గ్రేట్ సెయింట్, గ్రేట్ సీర్. ఒకటన్న మాట ఏంటి, అన్ని గుణాలు ఒకచోట మీట్ అయ్యాయి.

అమెరికాలో ఒకచోట మాట్లాడుతుంటే, ఏమిటి మీ రామకృష్ణుడి గురించి చెప్తున్నావు. వాడికి అక్షరాలు కూడా రావు, సంతకం పెట్టటం చేతకాదు. వాడు చాలా గొప్ప వాడు, గొప్ప టీచర్ అంటున్నావు. ఆ రామకృష్ణ పరమహంస ఎవడు, ఆ రామకృష్ణుడి యొక్క వైభవం, ఆయన సందేశం నువ్వు చెపుతున్నావు కాబట్టి తెలుస్తోంది. నువ్వు కదా రామకృష్ణుడి సందేశాన్ని ప్రపంచమంతా వ్యాప్తి చేస్తున్నావు అన్నారు. అప్పుడు వివేకానందుడు అన్నాడు, రామకృష్ణుడు అంటే ఎవరు అనుకొంటున్నావు? నువ్వు ఎవడైతే గొప్ప వాడు అనుకొంటున్నావో, ఇటువంటి వివేకానందులని ఒక్క స్మరణ మాత్రముచేత, ఒక్క తలంపు మాత్రము చేత వెయ్యిమంది వివేకానందులని ఈ లోకంలో పుట్టేలాగా చెయ్యగలడు, వాడు రామకృష్ణుడు అంటే అన్నాడు. వాడికి గురువు పట్ల అనుబంధం చూడండి!

నువ్వు భగవంతుడిని తెలుసుకొనే ప్రయాణంలో ఆ సాధనలో ఉన్నప్పుడు నీవాళ్ళు నిన్ను వెనక్కి పిలుస్తున్నప్పటికీ, నీ వాసనలు కోరికలు వెనక్కి లాగుతున్నప్పటికీ, నీ గమ్యం మర్చిపోకు. నీ గమ్యం చేరేవరకూ నువ్వు ప్రయాణం ఆపుచెయ్యకు. ఎంతకాలం అలా నిద్రపోతావు, ఎన్ని జన్మలు అలా తిరుగుతావు. ఎన్ని శవాలను మోస్తావు, ఎన్ని లోకాలు తిరుగుతావు మనసా! నీ స్వస్థానము భగవంతుడే, ఓ మనసా నీ స్వస్థానమునకు పొమ్ము అన్నాడు స్వామి వివేకానంద.

## శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

| | | |
|---|---|---|
| జనవరి | 6 | సద్గురు శ్రీ నాన్నగారి ఆరాధన ఉత్సవం |
| జనవరి | 11 | భగవాన్ శ్రీరమణమహర్షి జయంతి ఉత్సవం |

SRI RAMANA KSHETRAM A/c. No. **51010100649 7273**
**Corporation Bank, Palakol Branch,** IFSC Code : **CORP0001613**

**ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై** ఫోన్ : 04175-236174
**For Accomodation : Office Incharge Balaraju 08297672348, 9849124502**

### దిII 06-01-2020 సోమవారం
# సద్గురు శ్రీ నాన్నగారి ఆరాధన ఉత్సవం

| | | |
|---|---|---|
| ఉII గంII | 6-00లకు | పారాయణ |
| | 7-00లకు | అల్పాహారం |
| | 8-00లకు | పూజాకార్యక్రమములు |
| | 9-00లకు | డాక్టర్ ఉషగారి ప్రవచనము |
| | 11-00లకు | అన్నప్రసాదం |
| మIIగంII | 1-00లకు | హైదరాబాద్ అరుణగారి ప్రవచనము |

**భక్తులందరికీ ఆత్మీయ ఆహ్వానము**

### దిII 11-01-2020 శనివారం
# భగవాన్ శ్రీరమణమహర్షి జయంతి ఉత్సవం

| | | |
|---|---|---|
| ఉII గంII | 6-00లకు | పారాయణ |
| | 7-00లకు | అల్పాహారం |
| | 8-00లకు | పూజాకార్యక్రమములు |
| | 9-00లకు | భక్తుల ప్రవచనములు |
| | 11-00లకు | అన్నప్రసాదం |
| మIIగంII | 1-00లకు | హైదరాబాద్ అరుణగారి ప్రవచనము |

**భక్తులందరికీ ఆత్మీయ ఆహ్వానము**

# ఏకాంత జీవితంలోనే అనంత లాభం కలుగుతుంది

వైరాగ్యానికి మించిన బంధువు లేడు, సంసారానికి మించిన శత్రువు లేదు. మనస్సులోని బొమ్మలు అన్నీ మాయమై పోవాలి అవి ఉండటమే కాలము అవి అంతరించిపోయినప్పుడు కాలం కూడా అంతరించిపోతుంది, నిర్మల వర్తమానం మాత్రమే మిగులుతుంది. గతం-గతః భవిష్యత్తు పుట్టలేదు. వర్తమానంలో సత్యంలో ఉండటమే సాధన. బజారుకు వెళ్ళి వచ్చిన మనస్సు సంఘ దోషంతో విషమెక్కిన మనస్సు శుద్ధికి ఎంతోకాలం సాధన కావాలి. అలా సాధన చెయ్యాలి సాధకుడు. గజస్నానం లాంటివాడు కాకూడదు. బంధుమిత్రులు అనేవారు అందరూ ఎండిపోయిన పాత బావులు. మనం అందులో పడి కర్తవ్యం, బంధం అన్నట్లు కలలు గంటాము. దానికి అంతులేదు. ఒకరికి సాయం చేసాను అనే భ్రాంతి కల్పించుకోకూడదు. ఇది శాఖోపశాఖలతో వ్యాపించిన మర్రిచెట్టు వంటిది. ఈ విషయం మనం ప్రశ్నించటం ద్వారా కాక పరిశీలించటం ద్వారా చాల తెలుసుకొంటాము. పూర్వకాలంలో సాంప్రదాయ కుటుంబంలో పవిత్ర కన్యలు, ఇంటికి వచ్చిన పరులకు కనబడకుండా శబ్దం కూడా రాకుండా గాజులు చేతిపైకి ఉంచుకొని పనిలో మసిలేవారు. అలాగే సాధకుడు ఏకాంత వాసం కావాలి. చాలామందితో కలిస్తే కలహాలు, ఇద్దరితో కలిస్తే ముచ్చట్లు. జ్ఞానప్రాప్తికి చిత్తశుద్ధి అత్యవసరము. అది సంఘరాహిత్యముతో దైవమునందు భారం వైచి స్వధర్మము చేయుట వలన కలుగుతుంది. పవిత్రుడై తన ఉనికిచేతనే ప్రపంచం ఉద్ధరించబడుతుంది. తన్ను ఉద్ధరించుకున్నవాడే ఎదుటవాణ్ణి ఉద్ధరించగలడు. సర్పము ఒంటరిగానే తిరుగుతుంది, ఏమరపాటు లేకుండా తిరుగుతుంది. తన ఉనికిని ఇతరులకు తెలియనియ్యదు, పిచ్చికూతలు కూయదు. ఇల్లు కట్టుకొనే కాలం పాడుచేసుకోవటం ఎందుకని చీమల పుట్టలు, ఎలుక కన్నాలలోను ఉంటుంది. అలాగే సాధకుడు పెద్ద పెద్ద సౌధాలు కట్టి అగచాట్లు పడక క్షణభంగురమైన దేహంకోసం పెద్ద ఏర్పాట్లు కూడదు. శ్రీనాన్నగారు "సాధకునకు ఏకాంతవాసం - సహవాసం (సత్సంగము) గుహవాసము అంటే (హృదయంలో మనస్సును నిలబెట్టటం) కావాలి. కుటుంబ సభ్యులపై దయ ఎంతవరకూ ఉండాలో అంతవరకే ఉండాలి. దయపేరు చెప్పి నీ మనస్సును బయటకు తోలుకుపోతే లోపల సున్నా అవుతావు. బ్రహ్మం తెలియదు" అన్నారు. బాణాలు తయారుచేసేవాడు, చేపకు ఎర కట్టి తదేకంగా చూచేవాడి ఏకాగ్రత చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. అలాగే సాధకుడు వైరాగ్యాన్ని అలవర్చుకొని నిశ్చలంగా ఏకాంతంగా కూర్చొని గమ్యాన్ని గురించి ఎరుకగలవాడై ఉండాలి. మన గృహ జీవితాన్ని వినోదం చెయ్యకూడదు. మనకు అజ్ఞానమనే భూతం ఆవరించింది. ప్రకృతి ఆశయం ఏమిటి? పరిణామ ప్రవాహం ఏముఖంగా పరుగిడుతోంది అనేది తెలియాలి. ఆమె నన్ను ప్రేమిస్తున్నది, నేను ఆమెను ప్రేమిస్తున్నాను అంటే ఆమెలో భగవంతుణ్ణి ప్రేమిస్తున్నాను. బాహ్యరూప విన్యాసాలకు మోహితుడవు కాకూడదు. సత్యంలోనే ఆనందం ఉంది. ఆ సరళి మారితే అనంత లాభం కలుగుతుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**